ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

జూలై 27, 2008

54939

కథా నిలయం
శ్రీకాకుళం



సంగీత వనంలో రఫీ జ్ఞాపకాలు

హ్యాపీ బర్త్‌డే

(2008 జులై 27నుంచి- 2008 ఆగస్టు2 వరకు)

జ్ఞాన జస్వంతి(జున్ను)
5సం॥, జులై-27
శ్రీదేవి-శివప్రసాద్
విజయనగరం

జి. అపర్ణ
జులై-27
పద్మావతి-బాలనాగయ్య
మార్కాపురం-ప్రకాశం

బి. సుష్మ-సుశాంత్
జులై-27
సునంద-స్వామిదాస్
ముషీరాబాద్-హైదరాబాద్

ఎ. దివ్య-వెంకీ
జులై-27
శాంతకుమారి-వీరబ్రహ్మజీ
భవానీపురం-విజయవాడ

కె. సాయి స్నేహిత్
1సం॥, జులై-27
రజిని-సురేష్
అయ్యన్నపేట-విజయనగరం

అరణవ్ కొండా
2సం॥, ఆగస్టు-2
అలకారాణి-విజిత్‌కొండా
కాలిఫోర్నియా-అమెరికా

ఎం. వీరేంద్రవర్మ
3సం॥, జులై-30
సుమలత-చైతన్యకుమార్
విస్సన్నపేట-కృష్ణా

పండు
క్రాంతికుమారి
-మాధవరావు
కొత్తగూడెం-ఖమ్మం



హిమసిద్ధార్థ-మానస
సమత-నాగేశ్వరరావు
ఒంగోలు-ప్రకాశం

కె. వైష్ణవి
5సం॥, జులై-2003
ఆదిలక్ష్మి-వెంకటేశ్వరరావు
రెంటపాళ్ల-గుంటూరు

కె. శ్రీహర్ష
10సం॥, జులై-1998
శారద-వెంకటస్వామి
వనపర్తి-మ॥నగర్

పి. వీణ
8సం॥, జులై-27
రత్నకుమారి
-చక్రపాణి

ఆర్. అరుణ్‌కుమార్
6సం॥, జులై-2002
అపర్ణ-లింగరాజు
నరసాపురం-ప॥గో

జి. దీప్తి(పండు)
2సం॥, జులై-2006
దుర్గ-సత్యనారాయణ
ఐడిపిఎల్ కాలనీ-హైదరాబాద్

అబ్దుల్ రహమాన్
3సం॥, జులై-28
షకీరా సుల్తానా-గౌస్ పాషా
రేవతిసెంటర్-ఖమ్మం

బి. ప్రత్యూష
9సం॥, జులై-27
లక్ష్మీభవాని-రాము
మామిళ్లగూడెం-ఖమ్మం



కథా నిలయం ★ శ్రీకాకుళం

వనరులన్నీ అవసరాలకోసమే....

మన అతిథి

పేరు	:	డాక్టర్ ఎం.పి. పరమేశ్వరన్
పుట్టిన తేదీ	:	**18-1-1935**
తల్లిదండ్రులు	:	ఎం.పరమేశ్వరన్ నంబూద్రి, సావిత్రి అనంతరాజన్
స్వగ్రామం	:	త్రిసూర్ (కేరళ)
విద్యాభ్యాసం	:	ఎంఎస్‌సి, పిహెచ్‌డి (న్యూక్లియర్ ఫిజిక్స్)
వృత్తి	:	ఇంజనీరు, రచయిత
గుర్తింపు	:	ప్రజలనుంచి వచ్చే గుర్తింపే అసలైన గుర్తింపు. 'అవుట్‌లుక్' పత్రిక సర్వేలో దేశంలోని అరవైమంది ప్రముఖుల్లో ఆయన ఒకరు. ఆయన రచించిన గ్రంథాలకు ఆరు అవార్డులు వచ్చాయి.
ఇష్టపడేది	:	సమిష్టిగా కలలు కనడం
ఇష్టపడనిది	:	'మా ప్రాంతంలో ఇది సాధ్యపడదు' అని చెప్పడం
తీపి గుర్తులు	:	మిత్రుల్ని కలిసిన ప్రతి సందర్భం తీపిగుర్తే
లక్ష్యం	:	సమాజానికి అంకితం కావడం

ఎన్నో అడ్డంకులను అధిగమించి సమాజం ఇంత దూరం ప్రయాణించింది. ఇప్పుడు భౌతిక వసతులు, సుఖాలు బాగా పెరిగాయి. కానీ వీటికి అంతం ఎక్కడ. వనరులన్నీ అవసరాలకోసమే గాని విలాసాల కోసం కాదని మానవాళి గుర్తించే రోజు రావాలి. అలాంటి సమాజాన్ని అవతరింపజేయాలి.

ఈ సంచికలో....

టపా	...	2
ఆరోగ్యం	...	3
సీరియల్	...	8
సలహాలు	...	10
రుచి	...	11
బాలనేస్తాలు	...	12

ఇంకా...



చూద్దామా ... 4

దాతియా

మంచిపుస్తకం ...6

సిప్రాలి

మహాకవి హాస్యకేళి!

అట్టమీది కథ	...	14
లాహిరి... లాహిరి	...	20
విజ్ఞాన వీచిక	...	22
మనసా... తెలుసా	...	24

కథ 18

విరాగి!





చూడ చక్కని కమలాకృతులు

13-7-08 స్నేహలో 'అట్టమీదికథ'గా...బోనాల పండుగ విశేషాలు, తెలంగాణా ప్రాంత ప్రధాన పర్వదినం గురించి చక్కగా తెలియజేశారు. కమలాపళ్లతో చేసిన ఆకృతులు చూడ చక్కగా ఉన్నాయి. 'ఆరోగ్యం' ద్వారా ఫ్లూజ్వరం గురించి అవగాహన కలిగింపజేశారు. మాలిక్ అంబర్ స్థాపించిన ఔరంగాబాద్ గురించి యాజీవ్ చాలా చక్కగా తెలియజేశారు. కోల్‌కతా రైల్వే స్టేషన్‌లో 50 పైసలకే చపాతీని అందిస్తున్న ఫాతిమాబీబీ నిరు పేదలకు, అన్నపూర్ణగా కనిపిస్తుం దనటం నిర్వివాదాంశం. సినిమా కబుర్లు ప్రతీవారం తప్పక చదువు తాము. బాలనేస్తాలులో బొమ్మలు దాక్కున్న చిత్రం బావుంది. నిజాయితీ, నిబద్ధత ప్రధానంగా కావాలంటున్న మన అతిథి బీలా సత్యనారాయణ గారి మనోగతం విలువైనది.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం జంక్షన్, శ్రీకాకుళం.

ఔరౌరా!!!

ఔరంగజేబు కుమారుడు అజయ్ షా ఆగ్రాలో తాజ్ మహల్‌ని పోలిన కట్టడాన్ని తన తల్లి జ్ఞాపకార్థం నిర్మించిన "బీబీకా మక్బరా" భారతీయుల పర్యాటక కేంద్రంగా మారిందనటంలో సందేహంల్లేదు. ఈ కట్టడ నిర్మాణం లో జరిగిన యదార్థ సంఘటనలు ఔరంగాబాద్ గురించి ఔరౌరా!!! అనిపించే విధంగా మన స్నేహలో కళ్లముందుంచారు యాజీవ్! నిజానికి మన వారపత్రికలో చెప్పిన వన్నీ స్వయంగా తిలకించాను. మహమ్మద్‌బీన్ తుగ్లక్ రాజధాని దౌలతాబాద్, ఎల్లోరా, జైన గుహలు వంటివైతే చూస్తున్నపుడు కలగని అనుభూతి చదువుతుంటే మధురానుభూతి కలిగింది.

యర్రమోతు ధర్మరాజు,
ధవళేశ్వరం, తూర్పుగోదావరి జిల్లా.

చైతన్యపరుస్తున్న అతిథులు

అనేక మంది అనేక రంగాలలో రాణిస్తుంటారు. అటు వంటి వారి వివరాలు, వారి అభిప్రా యాలు చక్కగా వివరిస్తున్నారు. ఈ రచన ద్వారా సమాజసేవ, తదితర రంగాలలో ప్రతిభావంతుల జీవితాల గురించి తెలుపండి. ఈశీర్షికలో తెలిపే విషయాలు పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తాయనడంలో సందేహం లేదు.

గోలి నరసింహరాజు,
రామకృష్ణాపురం.

కమ్మని వంటలు

బీలా సత్యనారాయణ నిరక్షరాస్యతను రూపుమాపాలనడం బావుంది. అంతలావు ఔరంగాబాద్ విశేషాల్లో ఉప్పు చెరువు వృథా కావడం విచారం. బోనాల పండుగ, వైనాల వైభోగము సహజమైనది. శ్రావణమాస పండుగ శ్రావ్యమైనది. దద్దోజనం, అరటిపువ్వు కూర, బంగాళాదుంప కూర్మా ఈవారం వంటలు కమ్మగా వున్నాయి. ఫ్లూజ్వరం తీరు తెన్నులు ఆరోగ్య నియమావళి బావుంది. ఆరోగ్యమే మహాభాగ్యం కదా! చిరంజీవి చిన్నప్పటి బొమ్మ చిలిపిగా, అమాయకంగా ఉంది.

వాస్తు రామచంద్ర, రాంజీ నగర్,
నెల్లూరు.

అమ్మతల్లి బోనాలు

శ్రావణ బహుళ పాడ్యమి మొదలు అమావాస్య వరకూ తెలంగాణా ప్రాంతంలో పోచమ్మతల్లి బోనాల పండుగ విశేషాలను కె.నరహరి ఫొటో లతో ఇచ్చిన అట్టమీద కథ చదివి ఎంతో పరవశుల మయ్యాం! కాలం గడిచే కొద్దీ అమ్మ దేవతల స్థానంలో... కాళీమాత, మహం కాళి తల్లి, కనకదుర్గా భవాని, జగదాం బలను ఆరాధిం చటం చాలా ప్రాంతాలలో జరుగు తున్నది. అంటువ్యాధుల నుండి కాపాడేం దుకు బోనాలు అమ్మకు పెట్టే భోజనాలని ఈవ్యాస విశేషాల వలన తెలుసుకున్నాము.

జె. సుధాకర్ పట్నాయక్ ,
కాకినాడ, తూర్పుగోదావరి.

చదివి తీరాల్సిన పుస్తకం

ఉద్యమ కోణం పుస్తక పరిచయం స్ఫూర్తిదాయకం. ప్రపంచబ్యాంకు ఫర్మానాలు- ప్రజా కంటక వివాదాలు వ్యాసం సంచ లనం కలిగించింది. జాతీయ- అంతర్జాతీయ విషయాలతో పాటు ఉద్యమంలో రాటుదేలి, దానిలో పాల్గొంటూ ఉండబట్టే కామ్రేడ్ రాఘవులుగార్కి 'ఉద్యమకోణం' పుస్తకం రాయటం సాధ్యపడింది. ఉద్యమకారులు తప్పక చదువదగిన పుస్తకం. తెలుగు ప్రజలందరికీ సుపరిచితమైన 'అమ్మా బైలెల్లినావో తల్లీ బైలెల్లినావో' పాట బోనాలకు ప్రతీక. కవర్‌పేజీ స్టోరీ సాంప్రదాయ తెలంగాణా ప్రజల సంస్కృతి గురించి తెలుసుకున్నాం.

టి.శ్రీరామమూర్తి, గాజువాక,
విశాఖ.

సగర్వంగా చెప్పగలను

మన అతిథిలో ప్రచురిం చిన నిజాయితీ, నిబద్ధత అంటూ ఆచార్య బీలా సత్యనారాయణ గారి సందేశంలో నిజాయితీ బయట పడింది. విద్యారంగం పై ఉన్న ఆసక్తిని , అక్షరాశ్యత మీద ఉన్న మక్కువను చాలా తేటగా వర్ణించారు. తనకున్న గుణ లక్షణాన్ని నిజాయితీగా చెప్పారు. బాలకార్మిక వ్యవస్థ రూపు మాపాలంటూ, వరకట్నం వేధింపులు లేని సమాజాన్ని తీసుకు వద్దాం సత్యనారాయణ గారికి నా హృదయపూర్వక అభినందనలు. ఫ్లూజ్వరం వస్తే మేం తీసుకోవలసిన జాగ్రత్తలు చాలా చక్కగా వివరించారు. ఔరంగాబాద్ నగరం నిజంగా ఔత్సాహిక స్థలమే, మంచి విహార స్థలమే, చదివిన తరువాత ఏమేమి ఉన్నాయి, ఎవరు కట్టిం చారు, దానికున్న ప్రాముఖ్యత ఏమిటి, అనే విషయాలు తెలియ జేసినందుకు ధన్యవాదాలు. ఓ మంచి పుస్తకంలో 'ఉద్యమ కోణం'



పుస్తకసమీక్ష చాలా బావుంది. దేశ, రాష్ట్ర సమైక్యత కోసం పాటుపడిన కమ్యూనిస్టుల త్యాగఫలాలను ఓ ప్రత్యేకమైన శైలిలో మా కళ్ల ముందుంచింది. బి.వి రాఘవులు గారు రాసిన రచనలను ప్రచురిం చడం ఒక ఎత్తైతే ప్రచురించిన వాటిని పుస్తకరూపంలో ముద్రిం చటం మరోఎత్తు. ఏది ఏమైనా ప్రజల పక్షాన పాటుపడ్తున్న కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలను తెలియజేస్తూ.... రాజరికపు రాజకీయాలనుండి ప్రజలను ఓ విప్లవాత్మకమైన చైతన్య వంతులుగా తీర్చిదిద్దటంలో "కమ్యూనిస్టు పార్టీని కొట్టిన పార్టీ ఇక భూమి మీద పుట్టదు". ప్రజలకొరకు, ప్రజలక్షేమం కొరకు, న్యాయపరమైన సమానత్వంకోసం ఇరవై నాలు గ్గంటలూ పాటు బడిన నిజమైన నాయకులు కమ్యూనిస్టు నాయ కులని నేను సగర్వంగా చెప్పగలను. అవినీతిపరులకు మంచి గుణపాఠం చెపుతున్న ఈపుస్తకం చదివి సమాజిక దృక్పథంతో ముందుకు సాగాలని కోరు కుంటున్నాను.

కర్రా వరప్రసాద్,
యలమర్రు, కృష్ణాజిల్లా .

వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి?

ఈ ఫొటో ఓ ప్రముఖ రాజకీయనాయకు రాలిది. జవాబు తెలియాలంటే... 21వ పేజీ చూడండి.

ఆరోగ్యం



డాక్టర్ టిపిఎస్ భండారి,

సర్జికల్ ఆంకాలజిస్ట్, అపోలో క్యాన్సర్ సెంటర్, హైదరాబాద్. 9848112720

ఎముకల్లో క్యాన్సర్ వస్తే....



అంగవైకల్యం... అంటే కాళ్లు, చేతులు లేకపోవడం. ప్రమాదంలోగానీ, పుట్టుకతో వచ్చే పోలియో వల్లగానీ అంగవైకల్యం కలుగుతుంది. దీని బాధితులు అనుభవించే బాధ అంతా ఇంతా కాదు. శరీరంలోని ఎముకలకు క్యాన్సర్ వస్తే గతంలో క్యాన్సర్ వచ్చిన ఎముకను ... అంటే కాళ్లు, చేతులు, భుజం, తుంటి భాగాలను తొలగించే వారు. దీని వల్ల వారి జీవితం మంచానికీ, వీల్ చైర్‌కే పరిమితయ్యేది. ఇప్పుడు ఎముకల్లో వచ్చే క్యాన్సర్ కణితిని తొలగించి ఆ స్థానంలో టైటానియం రాడ్‌ను అమర్చడం వల్ల అవయవాలు తొలగించాల్సిన అవసరం లేదు. లింబ్ సాల్వేజ్ పద్ధతి ద్వారా చేసే శస్త్ర చికిత్స గురించి తెలుసుకుందామా.....

నియంత్రణ లేకుండా కణాలు విభజన చెందినప్పుడు ఏర్పడే కణజాల గడ్డను కణితి అంటారు. చాలా వరకు బోన్ ట్యూమర్లు ఎందుకు ఏర్పడతాయో కారణం తెలీదు. ఇలా పెరిగిన కణితి ఆరోగ్యమైన కణజాలం స్థానంలో అసాధారణ కణజాలాన్ని భర్తీచేస్తుంది. దీంతో ఎముక బలహీనంగా మారుతుంది. ఫలితంగా ఫ్రాక్చర్ అయ్యే అవకాశముంటుంది. కొన్ని సార్లు తీవ్రమైన కణుతులు ఏర్పడినప్పుడు లక్షణాలను గుర్తించాలి. వీటిని అశ్రద్ధ చేస్తే అంగవికలాంగులుగా మారొచ్చు. లేదా మరణం సంభవించొచ్చు.

అన్ని కణుతులు క్యాన్సర్‌కు చెందినవి కావు. వీటి వల్ల ప్రాణానికి ఎలాంటి హాని ఉండదు. వీటిలో కొన్ని మాత్రమే క్యాన్సర్‌కు చెందినవి. క్యాన్సర్ కణుతులు క్యాన్సర్ కణాలను శరీరమంతటికీ వ్యాపింపచేస్తాయి. ఇది రక్త ప్రసరణ లేదా లింఫ్ నాళాల వ్యవస్థ ద్వారా జరుగుతుంది. శరీరంలోని ఇతర భాగాల్లో ఏర్పడే క్యాన్సర్‌కు, ఎముకల్లో క్యాన్సర్‌కు తేడా ఉంటుంది.

బోన్ ట్యూమర్ రకాలు

ప్రాథమిక ఎముకల క్యాన్సర్‌లో సాధారణంగా నాలుగు రకాలున్నాయి.

మల్టిపుల్ మైలోమా : ప్రాథమిక ఎముక క్యాన్సర్లలో ఈ రకం సాధారణంగా వస్తుంది. ఇది ఎముక మజ్జకు చెందిన ప్రమాదకరమైన కణితి. పది లక్షల మందిలో 20 మంది దీని బారిన పడుతున్నారు. 50 నుంచి 70 ఏళ్ల వయసు వారిలో ఇది కనిపిస్తుంది. శరీరంలోని ఎముకల్లో ఏ భాగానికైనా రావొచ్చు.

ఆస్టేసర్కోమా : పది లక్షల మందిలో ముగ్గురికి ఇది వస్తుంది. యువకుల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. ఎక్కువ భాగం కణుతులు మోకాళ్ల దగ్గర ఏర్పడతాయి. ఇక్కడే కాక తుంటి, భుజాల దగ్గర కూడా ఏర్పడొచ్చు.

ఇవింగ్స్ సర్కోమా : ఐదు నుంచి 20 ఏళ్ల వయసు వారిలో ఈ రకమైన క్యాన్సర్ వస్తుంది. కాళ్ల పైన, కింద, పెల్విస్, చేతి పైభాగంలో, పక్కటెముకల్లో క్యాన్సర్‌ను గుర్తించొచ్చు.

కారణాలున్నాయా ?

సాధారణంగా సిగరెట్లు తాగితే ఊపిరితిత్తుల క్యాన్సర్, గుట్కాలు తింటే నోటి క్యాన్సర్ వస్తుందని చెబుతాం. కానీ యువకుల జీవితాన్ని అతలాకుతలం చేసే బోన్ ట్యూమర్ ఎందుకొస్తుందో కచ్చితమైన కారణం లేదు. ఎవరికైనా బోన్ ట్యూమర్ రావొచ్చు.

లక్షణాలు

కాళ్ల వాపు, నొప్పి, మోకాళ్లను, భుజాలను సులభంగా మడచలేకపోవడం.

ఎక్కడెక్కడ ?

శరీరంలో తల నుంచి పాదాల వరకు ఎముకలతో కూడిన అస్థిపంజరం ఉంటుంది. అయితే ఎముకలున్న అన్ని భాగాల్లో కణుతులు ఏర్పడవు. శరీరంలోని కొన్ని ప్రాంతాల్లోని ఎముకల్లోనే బోన్ ట్యూమర్ ఏర్పడుతుంది.

1) తొడ ఎముక కింద

2) కాలి పిక్కకు ముందు భాగాన ఉండే ఎముకపైభాగంలో.

3) భుజం పైభాగం చివరి భాగంలో.

వైద్య పరీక్షలు : ఎక్స్‌రే, నీడిల్ బయాప్సీ చేసి కణితిని నిర్ధారిస్తారు. కణితి పరిమాణం ఎంత సైజు ఉందనేది విశ్లేషించడానికి సిటి స్కానింగ్ చేస్తారు. కీమోథెరపీతో కణితి పరిమాణాన్ని తగ్గిస్తారు. 2 నుంచి 3 సార్లు కీమో థెరపీ చేస్తారు.

లింబ్ సాల్వేజ్

బోన్ ట్యూమర్ వచ్చినప్పుడు ఇంతకు ముందు కాళ్లు, చేతులు తొలగించేవారు. యుక్తవయసులోనే వీటిని కోల్పోవడం వల్ల బతుకంతా అంధకారంగా మారేది. క్యాన్సర్ చికిత్సలో వచ్చిన అధునాతన పద్ధతి.... లింబ్ సాల్వేజ్.. దీని ద్వారా రోగి సాధారణ జీవితాన్ని గడిపే వీలుంది. లింబ్ సాల్వేజ్‌కు ముందు కాళ్లు తొలగించడం వల్ల ఒకరిపై ఆధారపడేవారు. క్యాన్సర్‌కు గురైన ఎముకను తొలగిస్తారు. దీని దగ్గర ఉన్న కండరాలు, నరాలు, రక్తనాళాలకు ఎలాంటి హాని జరగదు. క్యాన్సర్ ఉన్న ఎముకను ప్రత్యేకమైన మిషన్ ద్వారా కత్తిరిస్తారు. ఆరోగ్యకరమైన ఎముకలోకి రంధ్రం చేస్తారు. టైటానియం లోహంతో తయారు చేసిన కృత్రిమ ఎముకను ఆ స్థానంలో అమరుస్తారు. ఎముకల్లో ఏర్పడే ట్యూమర్‌ను తొలగించడం వల్ల ఇప్పుడు వేగంగా పరుగెత్తకున్నా నడుస్తారు. తమ పనులు తాము చేసుకుంటారు. నాలుగు నుంచి ఐదు రోజుల పాటు ఆసుపత్రిలో ఉండాలి. మొదటి వారం కర్రల సహాయంతో నడుస్తారు. రెండో వారంలో వీటి సహాయం లేకుండానే నడక ప్రారంభిస్తారు. లింబ్ సాల్వేజ్ సర్జరీకి రూ. 50,000 ఖర్చువుతుంది.

యాజీవ్

దాతియా



దాతియా

మధ్య ప్రదేశ్‌లో ఉంది. అన్ని సంస్థానాలతోపాటు దాతియా 1947 తరువాత భారతదేశంలో విలీనమైంది. ఇక్కడ పురాతన కట్టడాలు చాలా ఉన్నాయి. ఊరికి మధ్యభాగంలో ఒక కొండమీద చాలా పురాతన రాజప్రాసాదం ఉంది. ఈ నగరం చుట్టూ పెద్ద ప్రాకారం, దానికి నాలుగు వైపులా గజద్వారాలున్నాయి. ఇప్పుడు ఊరు ప్రాకారం దాటి బయటకు పెరుగుతోంది. అసలు అక్కడ చూడదగిన ప్రాంతాలు, వాటి ప్రత్యేకతలు ఏంటో ఈ వారం చెప్పకుందాం.

పురానమహల్ ఒక వింత కట్టడం. కొండ చరియను నిటారుగా ఒలిచి రెండు అంతస్థులు కట్టినట్లుంటుంది. అలా కొండపైకి చేరుకొని చూస్తే వాటిపైన కొండమీద మరో ఐదు అంతస్థులు కనిపిస్తాయి. మొత్తం కలిపి ఇది 7 అంతస్థుల భవనం. దీని గురించి ఓ కథ ప్రచారంలో ఉంది. ఒక దైవజ్ఞుడు ఈ ప్రాంతంలో ఒక్కరాత్రిలో 62 ప్రాసాదాలను ఆవిర్భవింపజేశాడనీ, అందులో ఇదొక అద్భుత కట్టడమనీ ఇక్కడి ప్రజలు చెప్తారు. ఇక్కడ చిన్నా పెద్దా ప్రాసాదాలు అన్నీ కలిపితే 62 ఉంటాయేమో. ఈ కథ సంగతెలా ఉన్నా కొండను నిలువునా తొలిచి నిర్మించిన 7 అంతస్థుల భవనం అద్భుతంగా ఉంటుంది.

దాతియాకు 12 కిలోమీటర్ల దూరంలో గ్వాలియర్ రోడ్డుమీద కొంతదూరం వెళ్లి, ఎడమ పక్కకు తిరిగి 5 కిలోమీటర్లు వెళితే సోనగిరి చేరవచ్చు. దీనినే బంగారుకొండ అనికూడా అంటారు. ఇప్పుడిది కొద్దిపాటి ఇళ్లున్న చిన్నగ్రామం. ధర్మశాలలు మాత్రం చాలా ఉన్నాయి. ఇక్కడ నిత్యం అన్నదానం జరుగుతుంటుంది. ఇది జైనులకు చాలా పవిత్ర క్షేత్రం. దేశం నలుమూలల నుండీ భక్తులు వస్తారు. దీని విశిష్టత ఏమంటే, ఇక్కడ 500 మంది జైనమునులు కైవల్యం పొందారని చెప్పుకుంటుంటారు. అందుకే దీన్ని "శమోశరణ్" అంటారు. జైనుల కాల గణనం ప్రకారం, ఈ కైవల్య ప్రాప్తి నాలుగవ పాదంలో జరిగిందని కూడా అంటారు. ఇక్కడ మూడు పర్వతాలు కలిసి కనిపిస్తాయి. వాటిమీద 70/75 ప్రాచీన జైనమందిరాలున్నాయి. ఇక్కడి ప్రత్యేకత ఏమంటే కొండ ఎక్కేదారికి రెండుపక్కలా వరుసగా ఉన్న మందిరాలు మనతోపాటు పైకి వస్తున్నట్లుంటాయి. కొండ అవతలి అంచున పార్శ్వనాథుని మందిరం ఉంది. లోపల మండువా, చుట్టూ ఉన్న కారిడార్‌లో పార్శ్వనాథుడు తన దివ్య శక్తితో రోగనివారణ చేసినట్లు అనేక ఘట్టాలు చిత్రించి ఉన్నాయి. గర్భగుడిలో ముగ్గురు తీర్థంకరుల విగ్రహాలు, ఒక్కొక్కటీ రెండు నిలువుల పరిమాణంలో మలిచారు. బహు ప్రాచీన విగ్రహాలివి. వెలుపల పక్క పాలరాతి మండపాలలో అమర్చిన జైనతీర్థంకరుల దిగంబర మూర్తులున్నాయి. మందిరానికెదురుగా ధ్వజస్థంభం మినార్ శిల్పరీతిలో ఉంటుంది.

ఇక్కడున్న మరో మందిరం ఆసక్తికరంగా ఉంటుంది. ఇది ఇటీవలి కట్టడం. దీని గోపురశిఖరం మనోహరంగా ఉంది. లోపల నాలుగుపైపులా పీఠాలమీద నలుగురు తీర్థంకరుల విగ్రహాలను అమర్చారు.

మందిరానికి నాలుగువైపులా చిన్న మంటపాలున్నాయి. వీటినుంచి నేరుగా వెళ్తే ఒక్కో











తీర్థంకరుని దర్శింపవచ్చు.

ఇక్కడ ఆదినాళథుడు, పార్శ్వనాథుడు, మహావీరుడు ఇలా తీర్థంకరులందరికీ అనేక మందిరాలున్నాయి. ముందుకు వెళితే ఒకచోట "బజే శిలా రస్తా" అనే సూచిక ఉంటుంది. ఇక్కడి కొండ చివర పెద్ద అగాధం, కొండ పై అంచున పెద్ద తటాకం... దాని అంచున పెద్ద బండ వుంది. ఈ బండమీద చిన్న మొన మాత్రమే ఆని, చాలా ప్రమాదకరంగా పడి ఉన్న పెద్ద కొండరాయి కనిపిస్తుంది. ఈ పెద్దరాతిని చేతితో తాకితే వీణ మీటినట్లు శబ్దతరంగాలు వస్తాయి. ఎన్నిమార్లు పరీక్షించినా ఆదే శబ్దమాధుర్యం. ఈ బాజ్‌శిలనిక్కడ చాలా పవిత్రంగా భివిస్తారు.

రెండవ కొండమీదకెళ్లే దారిలో ఒక చోట తెల్లని పాలరాతిలో చిన్న స్థంభం, దీని పైభాగాన ఒక చక్రం మలిచారు. కింద పీఠంమీద వజ్రాల్లాంటి మాటలు, ఏమతానికి చెందని, హిందూ జాతియొక్క సరళ స్వభావాన్ని , మంచిని గౌరవించి ఆహ్వానించే సంస్కృతినీ ప్రతిఫలిస్తాయి. వీటిని హిందీ, ఇంగ్లీష్ భాషలలో మలచారు.

ఇంకా ముందుకెళ్తే మహావీరుని మందిరం ఒక స్థూపంపైన నిర్మించారు. ఇదిబౌద్ధస్తూపంలానే ఉంది. నాలుగు వైపులా మెట్లున్నాయి. ఇది చాలా ప్రాచీన కట్టడం.

ఈ కొండలమీద, ప్రాచీన మందిర సముదాయంలో, ఎంతో ప్రాచీనతా, పవిత్రతా, ప్రశాంతత కలబోసుకుని ఒకనాటి మతైక సాంఘీక శిఖరాలను రేఖామాత్రంగానైనా ఆవిష్కరిస్తాయి. ఈ కొండలమీద నెమళ్లు గుంపులు గుంపులుగా విహరిస్తుంటాయి. ఇక్కడే ముస్లింలకు పవిత్రమై మసీదుకూడా ఉంది.

❋



నవ్వుల్-పువ్వుల్

మీ నాన్నెక్కడ

టీచర్: అనిల్! మీ నాన్నెక్కడ ఉన్నారు?

అనిల్: ఆయనిప్పుడు భూమ్మీద లేరు సార్.

టీచర్: సారీ మీ నాన్న చనిపోయారా?

అనిల్: లేదు టీచర్ ఆయన వ్యోమగామి, అంతరిక్ష యాత్రకెళ్లారు.

కథా నిలయం
శ్రీకాకుళం

విప్లవ ఝుంఝూ ప్రభంజనాల శ్రీశ్రీ వినోద వ్యంగ్యవైభవాలను చిలికించడంలోనూ అంతే సమర్థుడని సాహిత్యోప జీవులకు తెలిసినంతగా అందరికీ తెలియక పోవచ్చు. 1950లలో శ్రీశ్రీ రాసిన 'మూడు యాభయిలు' కవిగా ఆయనలోని కొంటె కోణాలను లోకానికి చూపింది. కంద పద్యాలతో సిరిసిరిమువ్వలు, మాత్రాబద్ధమైన హ్రస్వ కవితలతో ప్రాసకీడలు, అయిదు చరణాల పంచ పదులు యాభై యాభై చొప్పున రాసి ప్రచురించారు.



శ్రీ.శ్రీ

సిప్రాలి మహాకవి హాస్యకేళి!

సిప్రాలి

ప్రతిభావంతుడైన ఒక్కొక్క కవీ,రచయితా మనపై ఒక చెరగని ముద్రవేస్తారు. వారిని తల్చుకోగానే అవే మనకు గుర్తుకు వస్తుంటాయి. కాని నిజానికి వారిలో అనేక ఇతర పార్శ్వాలు, కోణాలూ వుండకుండా పోవు. ఉదాహరణకు తెలుగువారికి మరపురాని ప్రియతమ మహాకవి శ్రీశ్రీ ని స్మరించుకోగానే మహాప్రస్థానం కళ్లముందు కదలాడుతుంది. "పదండి ముందుకు, పదండి తోసుకు" అంటూ కదం తొక్కుతున్న దృశ్యం గోచరిస్తుంది. సింధూరం రక్తచందనం కలబోసుకున్న నవ కవిత, తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరని ప్రశ్నించే దేశ చరిత్రలు, అందీ అందని కవితా దేవి చేలాంచముల విసురులను స్పృశిస్తూ ఆమెను తలిస్తే తనకు కనిపించే యథార్థ దృశ్యాలను అక్షర బద్ధం చేసిన 'కవితా ఓ కవితా', ఇంకా 'జగన్నాథ రథచక్రాలూ' భిన్న తరగతుల జీవిత పరిస్థితుల మధ్య ఏది ఎంచుకోవాలనే మీమాంస సంధ్యాసమస్యలు,భిక్షు వర్షీయసీలూ, బాటసారులూ ఇంకా ఎన్నో మహత్తర కవితలు మదిలో మెదులాడతాయి.

అయితే విప్లవ ఝుంఝూ ప్రభంజనాల శ్రీశ్రీ వినోద వ్యంగ్యవైభవాలను చిలికించడంలోనూ అంతే సమర్థుడని సాహిత్యోప జీవులకు తెలిసినంతగా అందరికీ తెలియక పోవచ్చు. శ్రీశ్రీ పరిమాణంలో ఎక్కువ కాకున్నా అన్ని ప్రక్రియలనూ రక్తికట్టించాడు. కవిత్వంతో పాటు కథ, వ్యాసం, నాటకం, విమర్శ, సమీక్ష, ప్రశ్నలూ జవాబులూ, ప్రహేళికలూ, అనువాదాలూ అన్నింటిలోనూ ఆరి తేరిన కలం ఆయనది.

ఈ రచనలలో నవ రసాలు కురిపించిన వైవిధ్యం ఆయన స్వంతం.

1950లలో శ్రీశ్రీ రాసిన 'మూడు యాభయిలు' కవిగా ఆయనలోని కొంటె కోణాలను లోకానికి చూపింది. కంద పద్యాలతో సిరిసిరిమువ్వలు, మాత్రాబద్ధమైన హ్రస్వ కవితలతో ప్రాసకీడలు, అయిదు చరణాల పంచ పదులు యాభై యాభై చొప్పున రాసి ప్రచురించారు. 'ఎవడు బతికేడు మూడు యాభయిలు' అన్న వాక్యంతో దాన్ని విడుదల చేశాడు. అంతకు ముందు పరిచయమైన శ్రీశ్రీకి పూర్తి భిన్నంగా చురుక్కుమనిపించే హాస్యరసధారల్లో ఓలలాడించాడు. అదే సమయంలో రాజకీయ సాంఘిక సాహిత్య విషయాల్లోనూ అనేక అక్షర సత్యాలు కూడా చెప్పాడు. మనం నిత్యం ఉటంకించుకునే అనేక వాక్యాలు ఈ మూడు యాభయిల లోనివే.

శ్రీశ్రీ అన్న తన పేరులోని అక్షరాలనే సిరిసిరిగా మార్చుకుని సిరిసిరి మువ్వ శతకం రాశాడు.పద్యాల పట్ల తనకు వ్యతిరేకత లేదని చెప్పడానికే గాక తేలికైన మాటలతో ఆషామాషీగా వాటిని రాయొచ్చుని నిరూపించడానికి కూడా రాశాడు. 'ఏవేనా కొత్తవి రా/శావా చూపించమంచు చంపేవాళ్లం/తా వినడానికి నే నీ జీవత్కృతి నాలపింతు సిరిసిరి మువ్వా' అంటూ మొదలెట్టడంలోనే ఆయన సులువు కనిపిస్తుంది.'కుర్చీలు విరిగిపోతే/ కూర్చోడం మానునట్లు గొప్ప రచనలన్/ కూర్చే శక్తి నశిస్తే/చేర్చదగునొకింత చెత్త..' అని తమాషా చేస్తాడు.'పొగచుట్టలెన్నియైనను/ సిగరెట్టుకు సాటి రావు..." అని సిగరెట్టును కీర్తిస్తాడు.'ఎప్పుడు పడితే అప్పుడు/ కప్పుడు కాఫీనొసంగ గలిగిన సుజనుల్/చొప్పడిన యూర నుండుము / చొప్పడ కున్నట్టియూరు చొరకుము మువ్వా' అని సుమతిని ఇమిటేట్ చేస్తాడు! ఈ శతకాన్ని శ్రీశ్రీ పూర్తిగా ప్రాచీన కావ్య సంప్రదాయ ఫక్కీలోనే రాయడం విశేషం. ' వ్యాపార ప్రకటనలే/ వ్యాపించుట చేత నేటి పత్రికలందున్/ రాపిడిపడి సత్యం కా/ శీ పయనం కట్టెనయ్యొ సిరిసిరి మువ్వా..' అని చురక వేశాడు. తన కాలపు కవులు రచయితలు,నాయకుల ధోరణులను సున్నితంగా ఆక్షేపించే పద్యాలు వీటిలో చాలా కనిపిస్తాయి. ఏది రాసినా ఆయన ముందుకు పోవడం గురించి తప్ప వెనకడుగు వేయడాన్ని ఆమోదించడు.' ముందుకు పోతానంటే/ ఎందుకు నీ విరగబాటు ఇటనే నిలుచో/ మందురు, వెనక్కి పోవల/ సిందని శాసింత్రు కూడా సిరి సిరి మువ్వా' అని అలాంటి వారిని విమర్శించారు. భర్తృహరి సుభాషితాల్లో మూర్ఖ పద్ధతిని అనుసరించి రాస్తూ మొదట్లోనే- 'నేనూ ఒక మూర్ఖుణ్ణే/ నాకన్నా మూఢులగుపడుతుంటే/ ఆనంద పారవశ్యము/చే నవ్వక తప్పలేదు సిరి సిరి మువ్వా' అంటాడు! ఇవన్నీ ఆయన కొంటె తనానికి తార్కాణాలు.'కోయకుమీ సొరకాయలు/ వ్రాయకుమీ నవలలని ఆవాకుచెవాకుల్/ దాయకుమీ అరవ ఫిలిం/ చేయకుమీ చేబదుళ్లు సిరిసిరిమువ్వా'

'రాస క్రీడ శృంగారానికి/ రమ్యమైన బాణం/ప్రాసక్రీడ హాస్యానికి పసందైన బాణం' అంటూ ప్రాసక్రీడల్లోకి తీసుకెళ్లాడు. వీటిలో చాలా కవితలు సుపరిచితమైనవే. 'కొంతమంది కుర్రవాళ్లు/ పుట్టుకతో వృద్ధులు/ పేర్లకీ పుకార్లకీ ఫకీర్లకి నిబద్ధులు/.. కొంతమంది యువకులు రా / బోవు యుగం దూతలు/ పావన నవజీవన బృం/ దావన నిర్మాతలు' అంటూ సాగే ప్రసిద్ధ గీతం ఈ భాగంలోనే చూస్తాం. శ్రీశ్రీ వీటిని నాటి పరిస్థితులకు ప్రతిస్పందనగా రాశాడు గనకే అనేక రాజకీయ సామాజిక సత్యాలు అగుపిస్తాయి. వాటిలో కొన్ని శాశ్వతంగా

నిలిచిపోయాయి కూడా. 'అరె యార్ ఇదరావో దేఖో/ ఆంధ్రుల దినపత్రిక/ పెట్టుబడికి కట్టుకథకి/ పుట్టిన విష పుత్రిక' చరణాలు గొప్పగా పేరు పొందాయి. 'అడుగు జాడ గురజాడది/ అది భావికి బాట/ మనలో వెధవాయిత్వం/ మరపించే పాట' అన్న చరణాలు కూడా ఆ కోవకు చెందినవే. 'యెంకిపాట వన్నుమోరు/ కవి కోకిల గబ్బిలం/ విశ్వసత్యనారాయణ/ అగ్గిమీద గుగ్గిలం' 'గుడిపాటి వెంకట చలం/ కలం కోర పారాడెన్' ఇలా తన కాలపు ప్రసిద్ధులపై ప్రేమ గౌరవం సరదా అన్నిటినీ కలగలపి రాశాడు.'భాషా ప్రయుక్తం రాష్ట్ర రచన/ దేశానికరిష్టం/ అసలు రహస్యం/ వెప్రాహా కది కష్టం' అంటూ ఆయన పాత్రను ఎండగట్టాడు.' ఆంధ్ర రాష్ట్ర జన్మదినం/ అక్టోబరు ఫస్టు/ అది త్వరలో వరలు విశా/ లాంధ్రానికి ట్రస్టు' అంటూ జరగవలసిన దాన్ని సూచించారు. ఈ తమాషా కవితలలో విమర్శలను తట్టుకోలేక కొందరు గగ్గోలు పెట్టినప్పుడు 'ప్రజా జీవితపు దారుల / పయనించే వారలు/రకరకాల విమర్శలక/ తలయొగ్గక తీరదు' 'వ్యక్తుల ప్రైవేటు బ్రతుకు/ వారి వారిసొంతం/ పబ్లికులో నిలబడితే/ ఏమైనా అంటాం' అని రాసినవి కూడా తరచూ ఉటంకించబడే చరణాలే.

ఇక తర్వాత పంచపదులు పేరిట అయిదు చరణాల కవితలు వస్తాయి. వీటిలో ప్రధానంగా అంత్యప్రాసల తమాషాలుంటాయి.'శ్రీమాన్ విశ్వనాథ సత్యనారాయణ' గారి శ్రీమద్రామయణ/కావ్యం రోజూ పారాయణ/ చేసేవాళ్లెవరూ లేరాయన/ వున్నానని ఒకడేనా అంటే అంటే సంతోషిస్తారాయన' అన్నది వీటిలో బాగా పాపులర్. 'అలాగే తన గురించి ఆంగ్లం మేళవించి' విదూషకుడి టెంటర్‌మెంట్/ ఏదో ఒక డిస్‌కంటెంట్/బ్రతుకుతో ఎక్స్‌పరిమెంట్/ పదాలు పేటెంట్,రసాలు టోరెంట్, సత్తమస్యకి సాల్వెంట్ శ్రీశ్రీ జయంట్ అంటూ చెప్పుకుంటాడు. 'అల్లాటప్పా/ రాతలు రాయడమే చెప్పుకోదగ్గ గొప్పా/ఒప్పుకోదగ్గ మెప్పా/ అలాంటి రచయితల చెవులు మెలితిప్పా/ నంటే అది నా తప్పా' అని ప్రశ్నిస్తాడు. ఇప్పటి పరిస్థితిని తలపించేలా కుస్వతంత్రంలో 'పేరుకు మాత్రం స్వతంత్రం/ చేసేదంతా కుతంత్రం/ చేరువ కాగా జీవిత సాయంత్రం/ జపించి అమెరికా మంత్రం/ పట్టుకోబోతారు రాజ్యాంగ యంత్రం' అని రాశాడు.

ఇప్పటి వరకూ ప్రస్తావించినవి ప్రధానంగా 50-60 దశకంలో రాసినవి కాగా విరసంలో చేరిన తర్వాత 70లలో రాసినవి కూడా వున్నాయి. అయితే వీటిలో శైలిలోనూ తీవ్రతలోనూ స్పష్టమైన తేడా వుంటుంది. అంతకు ముందు సున్నితమైన హాస్యం వుంటే తర్వాత రాసిన వాటిలో తిట్ల శాతం పెరిగింది. అలాగే మామూలుగా సభల్లో ఉపయోగించని పదాలను కూడా విరివిగా దొర్లించడం చూస్తాం. వీటిలోనూ కొన్ని మంచివి లేకపోలేదు గాని ఎక్కువ భాగం విరసం వ్యతిరేకులను దూషించేందుకు ఉద్దేశించబడినవే. మూడు యాభయిలు' 1964లో వస్తే మరో 'మూడు యాభయిలు' 1974లో వచ్చాయి.వీటి మధ్యన 1970లో రాసినవి కొన్ని వున్నాయని ఈ పుస్తకం సంపాదకుడు చలసాని ప్రసాద్ తెలిపారు. 'లిమరుక్కులు' అనే కొత్త విభాగం కూడా చేరింది. 'లిమరుక్' అనే ఆంగ్ల ప్రక్రియకు అనుసృజనే ఈ 'లిమరుక్కులు'. అయితే పుస్తకం ఒకటే అయినా వీటిని విడివిడిగానే వుంచితే చారిత్రిక అధ్యయనానికి సహాయంగా వుండేది కాని సంపాదకులు అన్నిటినీ కలగలపి ఇచ్చారు. అలాగే అంతకు ముందు ప్రచురించిన మేమే అనే మరో దీర్ఘ కవితనూ జత చేశారు.

' నేను/ ముసలివాణ్ని/ కాను అసలు వాణ్ని/ పడగెత్తిన తాచు పాము బుసలవాణ్ని/ పీడితుల్ని వెంటేసుకు మసలువాణ్ని/ అందుకున్న ఆకాశపు కొసలవాణ్ని' 'నిజంగా నేను/ ప్రజల కవినేను/ఎంచేతంటేనే/ వాళ్లను చది వేను/చదివిందే రాసేను' అంటూ తన గురించి చెప్పుకుంటూ లిమరుక్కులు మొదలెట్టారు. ఇందులో నగ్జలైట్లను,దిగంబర కవులను, విరసంను కీర్తించే కవితలు కొన్ని వున్నాయి. అలాంటి ఓ లిమరుక్కు విశాలాంధ్ర సోల్ డ్రిస్టిబ్యూషన్‌లోనూ వెనక అట్టపైన అలాగే వుంచడం ఆసక్తికరం.' తెల్లకమ్యూనిస్టులు/రక్తపాతానికనిష్టులు/ విప్లవానికి బహిష్టులు/ ఇందిరారాధనలో శ్రేష్టులు' అన్న కవిత మరొకటి 'మాజీ కమ్యూనిస్టులు/ఈజీ బతుకులకిష్టులు/రాజీ భావాకృష్టులు/ నాజీ భూతావిష్టులు' 'ఫిలిం ప్రపంచం కల్తీ/ అందులోదంతా ఫిల్తీ' వంటి కవితలు కూడా వున్నా కేవలం శాపనార్థాలు దూషణలుగా పేర్కొనదగినవి కూడా చాలా వున్నాయి. ఇవన్నీ చదవడం శ్రీశ్రీ సాహిత్య పరిణామాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

ముందే చెప్పుకున్నట్టు విప్లవ కవిత్వంతో వుర్రూతలూపిన మహాకవి మరో రూపం ఇది. భాషపైన ఆయనకున్న పట్టు, చమత్కారం, వ్యంగ్యం సృష్టించగల అసమాన ప్రతిభ మనకు తెలుస్తాయి. ఇప్పటికే ఆ నోట ఈనోట వింటున్న కొన్ని సుపరిచిత చరణాలు కూడా చూస్తాము.వీటన్నిటినీ సేకరించి మొదటి సమగ్ర సంపుటంగా ప్రచురించిన విరసం చలసాని ప్రసాద్ ఎంతైనా అభినందనీయుడు. లేకపోతే ఇవి అటూ ఇటూ చెల్లాచెదురుగానే వుండిపోయేవి. దాంతో పాటే మనవి మాటల్లో వీటి నేపథ్యాన్ని వీటిరూపకల్పనలోని భాషాచంద: సంబంధమైన అంశాలనూ విశ్లేషణాత్మకంగా అందించడం మరింత ప్రయోజనకరంగా వుంది.

శ్రీశ్రీ

సిప్రాలి

కూర్పు: చలసాని ప్రసాద్

వెల:80/-, పేజీలు:152

ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్, అబిడ్స్, సుల్తాన్ బజార్, హైదరాబాద్. అన్ని బ్రాంచీలు.



ఋతుఘోష

పద్య కావం

మండే సూర్యుడు

వచన కవితా సంపుటి

వెల:95/-, పేజీలు:100

ప్రతులకు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, నవోదయ, నవ్య పుస్తక షాపులు.

స్వీకారం

విహ్వాల

కథలు

మబ్బుల్లో దర్బారు

విప్లవ నాటిక,

కవిత

వెల:95/-, పేజీలు:112

ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, నవోదయ, నవ్య పుస్తక షాపులు.



సీరియల్

మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)

తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

జరిగినకథ:

29నాడు ఉదయం తొమ్మిదింటికి కలరో, ఏజెన్సీకి చేరుకున్నాడు. అప్పటికే కొందరు యుద్ధసన్నాహాలు చేసుకుంటున్నారు (సైనికులిప్పటికి ఎన్నిసార్లు మెరుపుదాడులు చేయలేదని! సంధి పత్రాల మీద సంతకాలు ఆరిపోకుండానే ఊచకోత కోశారు). ఆరవై మంది యువకులు ఆయుధాలు పట్టుకుని అసహనంగా తిరుగుతున్నారు. మీకర్‌తో సమావేశం సంతృప్తికరంగా లేదన్నాడు జాక్. సైనికులను మిల్క్ రివర్ వద్దే ఆపుదామని తార్న్‌బర్గ్ చేసిన వాగ్దానం తనకు సంతోషం కలిగించిందన్నాడు కలరో.

అమెరికన్ దేగ

63వ భాగం

తార్న్‌బర్గ్ సైన్యం, మిల్క్ రివర్ దాటి ముందుకు వచ్చిన విషయం ఇండియన్లు పసిగట్టలేకపోయారు. గుర్రాలకు నీళ్ళు పట్టించి, తన అశ్వాలతో కొందర్ని వెంటబెట్టుకుని ఒక దగ్గర దారిలో కదులుతున్నప్పుడు యూట్‌ల కంటబడ్డారు. వెంటనే ఒక వేగులవాడు వచ్చి, "సైనికులు వచ్చేశారు" అంటూ జాక్‌ను హెచ్చరించాడు.

ఎవరూ పోరాటానికి సిద్ధంగాలేరు. కొద్దిమంది యోధులతో అసలు విషయమేంటో తెలుసుకోవటానికి ముందుక్కదిలాడు జాక్. దారికడ్డంగా నిల్చిన సైనికుల వ్యాగన్లు యుద్ధవాతావరణాన్ని తలపించాయి. ముప్పై, నలభై మంది అశ్వికులు పొజిషన్ తీసుకుని తుపాకులెక్కుపెట్టారు. "ఏడాది క్రితమే నేను జనరల్ క్రూక్ తరపున సియోలతో యుద్ధం చేశాను. సైనికులలా నిలబడ్డారంటే కాలుస్తారన్నమాటే... నేనూ, మావాళ్ళను పొజిషన్ తీసుకొమ్మన్నాను" అంటూ గుర్తుచేసుకున్నాడు జాక్.

ఆనాటి అశ్వికులకు నాయకుడు లెఫ్టినెంట్ సామ్యుయెల్ చెర్రీ. చివరి నిమిషంలో, తన సైనికులను కాల్చవద్దని ఆదేశించాడు. మేజర్ తార్న్‌బర్గ్ కూడా ఒక్కసారి ఇండియన్ల పరిస్థితి గమనించి, అది సరైన నిర్ణయమేనని అభినందించాడు.

నాలుగైదు నిమిషాల తర్వాత తార్న్‌బర్గ్ సమావేశానికి ఆహ్వానిస్తాడు కాబోలనుకున్నాడు జాక్. యూట్‌లు ఆ చొరవ తీసుకుంటే అంగీకరిద్దామనుకున్నాడు మేజర్.

"నేనే వెళ్ళి చర్చలు ప్రారంభించమన్నాను" అంటూ ఆనాటి సంఘటన వివరాలు నెమరేసుకున్నాడు జాక్. "ఇరుపక్షాల మధ్యా కొద్ది అడుగుల దూరమే ఉంది. అకస్మాత్తుగా, ఎవరో తుపాకీ పేల్చారు. ఒకే ఒక్క తూటా. ఎవరు పేల్చారో కూడా తెలీదు. కానీ, మరుక్షణమే వాతావరణమంతా తుపాకీ మోతలతో ప్రతిధ్వనించింది. అంత మంది ఒకేసారి పేలిస్తే ఎలా ఆపగలను? "డోన్ట్ ఫైర్, మనం చర్చలకు సిద్ధం" అని మావాళ్ళ వైపు తిరిగి అరిచాను. కానీ, నా మాటల్లో వాళ్ళకు "ఫైర్" అన్న పదమొక్కటే విన్పించినట్టుంది".

చాలాసేపు యుద్ధం కొనసాగింది. కాల్పులు జరుగుతున్నాయని తెలిసి, 'నిక్' మీకర్‌ను జోక్యం చేసుకుని ఆపమన్నాడు క్వింకెట్. సైనికులు రిజర్వేషన్‌లోకి ప్రవేశించి మరీ జనాన్ని చంపమన్నారని వాపోయాడు. ప్రమాదమేమీ లేదు. రేపు వెళ్ళి సైనికులతో మాట్లాడమన్నాడు మీకర్.

మధ్యాహ్నం వరకు యూట్‌లందరికీ మిల్క్‌రివర్ వద్ద యుద్ధం జరుగుతుందని తెలిసింది. ఓ డజను మంది యువకులు ఏజెన్సీలో ఉన్న ప్రభుత్వ భవనాల మీదా, తెల్ల ఉద్యోగుల మీదా తుపాకులు పేల్చారు. సాయంత్రం వరకు నతాన్‌మీకర్, ఇతర సిబ్బంది కాల్పుల్లో మరణించారు. ముగ్గురు తెల్లజాతి స్త్రీలను బందీలుగా పట్టుకుని పైసియాన్స్ క్రీక్ వద్దఉన్న యూట్ క్యాంపుకు పారిపోయారు. తెల్లవాళ్లను విపరీతంగా ద్వేషించే కొందరు దారిలో ఆ ముగ్గురు స్త్రీలమీదా అత్యాచారం చేశారు.

మిల్క్ రివర్ వద్ద వారం రోజులపాటు యుద్ధం కొనసాగింది. మూడువందల మంది యూట్ యోధులు, రెండువందల మంది సైనికులను చుట్టుముట్టి పోరాడారు. మేజర్ తార్న్‌బర్గ్ తీవ్ర గాయలతో మరణించాడు. యుద్ధం ముగిసేసరికి 12 మంది సైనికులు హతులయ్యారు. మరో నలభై ముగ్గురు క్షతగాత్రులయ్యారు. రిజర్వేషన్ రక్షణలో ముప్పైఏడుమంది యూట్‌లు కూడా నేలకొరిగారు (ఇందులో కొందరు బందీలు కావడం ఇష్టంలేక మొండిగా ఎదురొడ్డి మరణించారు).

150 మైళ్ల దక్షిణాన, లాస్‌పైనోస్ ఏజెన్సీలో ఊరేకి విషయం తెలిసి విస్మయం చెందాడు. తమ తెగ మనుగడకు ముప్పు రాకుండా ఉండాలంటే ఈ మారణహోమాన్ని ఆపాలి. అక్టోబర్ 2 నాడు, ఒక అనుచరుడితో వివిధ తెగల నాయకులకో సందేశం వంపించాడు.

"తెల్లవాళ్లకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలన్నీ తక్షణం ఆపెయ్యాలి. ఆత్మ రక్షణకోసం తప్ప ఎవరికీ ఎటువంటి హానీ తలపెట్టకూడదు. ఎవరైనా అత్యుత్సాహంతో పోరాటం ప్రారంభిస్తే అది ఇండియన్ల నాశనానికి దారి తీస్తుందని గ్రహించండి".

ఊరే సందేశం వల్లనైతేనేమి, అదనపు బలగాల రాకవల్లనైతేనేమి, యుద్ధం తాత్కాలికంగా ఆగింది. కానీ, అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోయింది. యూట్‌లను సమూలంగా నాశనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి తోడు గవర్నర్ పిట్కిన్, విలియం వికర్స్ తమ యూట్ వ్యతిరేక విషప్రచారాన్ని తీవ్రతరం చేశారు. వాళ్లంతా నరరూప రాక్షసులని, ఈ రక్త పిపాసులున్నంతకాలం కొలరాడోలో ఎవరికీ క్షేమం లేదని కరపత్రాలు పంచారు (ఈ యుద్ధాలతో సంబంధంలేని). "అన్ కంపాగ్రెస్" తెగను కూడా నిర్మూలించాలని వాదించారు. తెల్లవాళ్లందరూ ఏకమై ఎర్రతోలు రాక్షసులను మట్టు పెట్టాలని ఒక

ఉద్యమం ప్రారంభించాడు వికర్స్. ప్రభుత్వం మీద ఆధారపడకుండా, పౌరులే 'మిలిషియా'గా ఏర్పడి ఈ 'ఆటవికులను' కనిపించినవాళ్లను కనిపించినట్టే నరికి పోగులు పెట్టాలి" ఇదీ అతనిచ్చిన పత్రికా ప్రకటనల సారాంశం.

ఈ ద్వేష ప్రచారానికి ఆజ్యం పోస్తూ గవర్నర్ పిట్కిన్ మరో ప్రకటన విడుదల చేశాడు. "కొలరాడో ఇండియన్లూ, మనమూ కలిసి ఇక సహజీవనం చేయలేం. కనిపించినచోటల్లా తెల్లవాళ్లను హత్య చేస్తున్నారు యూట్‌లు. మన ఆస్తులను కొల్లగొడుతున్నారు. స్త్రీలమీద అత్యాచారాలు చేస్తున్నారు. వాళ్లు అనాగరికులు, పాశవికులు. అందువలన, నా అభిప్రాయంలో ప్రభుత్వం తక్షణం వాళ్లను ఎక్కడికైనా దూరంగా రిజర్వేషన్‌కు తరలించాలి. లేదా ఆ తెగలన్నింటినీ తుడిచిపెట్టాలి. అందరి సహకారంతో మన రక్షణకోసం నేను ఇరవై నాలుగ్గంటల్లో 25,000 వేల స్వయం సేవకులదళం ఏర్పాటు చేయగలను. ఒకసారి "ఇండియన్ సమస్య" పరిష్కారమైతే మనం సుఖశాంతులతో జీవించగలం. 12,000,000 ఎకరాల నేల - సారవంతమైన సాగుభూమి మనదౌతుంది. ఇక్కడి ఖనిజాల మీద మనకే హక్కు ఏర్పడుతుంది. అంటే వాళ్లతో మనంచేసే పోరాటానికయ్యే ఖర్చులు కొద్దిరోజుల్లోనే తీరిపోతాయి".

వైట్‌రివర్ యూట్‌లు తాము అపహరించిన ముగ్గురు శ్వేతజాతి స్త్రీలను అధికారులకు అప్పగించారు. సహజంగానే ఆ సంఘటన గురించి విచారణ ప్రారంభమైంది. ఒక ప్రత్యేక కమీషన్‌కూడా వేశారు. ముద్దాయిల నేరం రుజువు చేసి శిక్ష ఖరారు చేయాలి. మిల్క్ రివర్ పోరాటాన్ని ఒక చిన్న తగువు మాత్రమేననీ, వైట్‌రివర్ సంఘటనను 'నరమేధం' అనీ నిర్ణయించారు (నిర్ణయం సరైనదే). జాక్, కలరోలు యోధులనీ, అందువల్ల పోరాట క్రమంలో వాళ్ల చర్యలు నేరాలుగా పరిగణించలేదని కమీషన్ తీర్మానించింది. డగ్లస్ అతని అనుచరులను హంతకులుగా తీర్పు చెప్పారు. నతాన్ మీకర్ హంతకులను మాత్రం గుర్తించలేకపోయారు.

మొదటి తుపాకీ పేలినపుడు తను స్టోర్‌రూంలో ఉన్నానన్నాడు డగ్లస్. "బైటకి వచ్చి చూశాను. అన్ని వైపులనుండి తుపాకుల శబ్దం వినిపించింది. అంతమంది అమాయకులు నేలకొరుగుతున్నందుకు బాధ భరించలేక అరిచాను. కానీ రహస్య విచారణలో అర్విలా మీకర్ (మీకర్‌భార్య) డగ్లస్ తనను బలాత్కరించాడని ఆరోపించడంతో, అతణ్ణి లీవెన్‌వర్త్ జైలుకు పంపారు. అతడి నేరం కూడా రుజువు కాలేదు (రుజువైతే మిసెస్ మీకర్ ప్రతిష్ట దిగజారుతుంది). ఇండియన్లతో లైంగిక సంబంధాలను అంగీకరించగలిగిన సమాజం కాదది.

అయితే, కొద్దిమంది ఇండియన్లకు వేసిన శిక్షలు రాజకీయ నాయకులనూ, మైనర్లనూ తృప్తిపరచలేకపోయాయి. యూట్‌ల ఏడు నివాస ప్రాంతాలు - పన్నెండు మిలియన్ ఎకరాల నేల - తమది కావాలి. యూట్‌లను తుడిచిపెట్టాలి.

1880లో యూట్‌ల తరుపున వాదించటానికి వాషింగ్టన్‌కు వచ్చేనాటికే ఊరే ఆరోగ్యం పాడైంది. నెఫ్రైటిస్ బాధపడుతున్నాడు - డాక్టర్లు కూడా రక్షించలేనంతగా ముదిరిపోయింది వ్యాధి. చేసేది లేక, బిగ్ ఐస్ షర్జ్ కోరినట్టుగా "యూట్స్ మస్ట్ గో" నినాదానికి తన అంగీకారం తెలియజేసి యూట్‌లు కొత్త రిజర్వేషన్‌కు తరలిపోటానికి అంగీకరించాడు. - మార్మాన్‌లకు ఈ ప్రాంతమంటే గిట్టదు. అక్కడికి చేరుకోవాలంటే యూట్‌లు 350 మైళ్లు ప్రయాణం చేయాలి. అదృష్టంకొద్దీ, ఈ ప్రయాణానికి ముందే 1881, ఆగస్టులో ఊరే మరణించాడు. ఒక చిన్న ప్రాంతం తప్ప, కొలరాడోలో నిజంగానే యూట్‌లు తుడిచిపెట్టారు. షెయెనీ, అరాపాహో, కియోవా, కొమాంచీ, జికారిలా, యూట్ - ఒకటా, రెండా పర్వతాలనే నమ్ముకున్న ఈ తెగలేవీ లేవిప్పుడు - తెల్లవాళ్లు రాజ్యమేలుతున్న ఈ నేలమీద వాళ్ల పేర్లు మాత్రమే వినబడుతుంటాయి అప్పుడప్పుడూ.

అపాచీలు

తృప్తిగానే బతుకుతున్నాం. సరిపోయినంత తిండి దొరుకుతున్నది. మా కుటుంబాలూ, బంధుమిత్రులందరూ సుఖంగానే ఉన్నారు. మరి, మా గురించి ఇంత దారుణమైన వార్తలు ఎవరు ప్రచారం చేస్తున్నారో తెలియడంలేదు. అమెరికన్‌లను గానీ, ఇండియన్లను గానీ, చంపలేదు. ఎవరికే అపకారం తలపెట్టలేదు (రిజర్వేషన్ అధికారులు). మా మీద నేరాలు ఆరోపించడానికి ఆధారమే లేదు. నా మనస్సాక్షిగా చెపుతున్న మాటలివి. (మీ) నాగరికతకు దూరంగా, చెట్లనీడలో బతికే మావల్ల మీకు ప్రమాదం పొంచి వుందా? జనరల్ క్రూక్ ఆదేశాలను తుచ తప్పకుండా పాటిస్తూనే ఉన్నామే! నన్నెందుకు అరెస్టు చేస్తారు? ఎవరా ఆర్డర్ ఇచ్చారు? వెలుగు చీకట్లు ముందు, దేవుడి ముందు మోకరిల్లి ప్రార్థిస్తున్నాను. మా మానానికి మమ్మల్ని వదలండి. ఇలా ప్రశాంతంగా బతకనీయండి. నన్ను ఉరితీయాలని పేపర్లలో వార్తలు వస్తున్నాయి. మీ ఆశ్రితులను కూడా ఉరితీస్తే ఇక మిగిలేదెవరు? మా తెగ అంతరించింది. కొద్ది మందిమి మాత్రమే ఇంకా మిగిలున్నాం. ఎవరైనా ఆజ్ఞలను ఉల్లంఘిస్తే వాళ్లకు శిక్షలు విధించి మిగిలిన వాళ్లను వదిలిపెట్టండి. ఇదేనా విన్నపం.

- గోయాత్లే- (జెరోనిమో)

1874లో కాచైస్ మరణం తర్వాత అతడి పెద్ద కొడుకు టాజా, చెరికాహువా తెగకు నాయకుడిగా బాధ్యతలు స్వీకరించాడు. ఆదే సమయంలో ప్రభుత్వం తరపున అపాజీ పాస్ రిజర్వేషన్‌కు ఏజెంట్‌గా టాగ్లిటో (టాంజెఫోర్డ్స్) అధికారంలో ఉన్నాడు. తండ్రిలాగా సమర్ధుడు కాదు టాజా. చిరికాహువాలా మద్దతు కూడ గట్టుకోవడం కష్టమైంది. కొద్దిలోజుల్లోనే తెగ చిన్న చిన్న విభాగాలుగా విడిపోయింది. టాజా, జెఫోర్డ్ లు ఎంత ప్రయత్నించినా వాళ్లలో ఐక్యత వీలుపడదు. ఒకప్పుడు కాచైస్ పెట్టిన నియమాలను ధిక్కరించి, ఎవరికి వారే (తెల్లవాళ్ల ఆస్తులమీద) దాడులు పునః ప్రారంభించారు. మెక్సికో సరిహద్దుకు సమీపంలో ఉన్న చిరికాహువా రిజర్వేషన్, అరిజోనా, మెక్సికోల నుండి పారిపోయివచ్చిన అపాచీలకు విడిదికేంద్రంగా మారింది. ఇదోనెపంగా చూపి, అమెరికన్ భూములనే కబ్జా చేయటం లక్ష్యంగా పెట్టుకున్న తెల్లవాళ్లు చిరికాహువాలను మరెక్కడికైనా తరలించాలని అధికారులమీద ఒత్తిడి పెంచారు.

1875 నాటికి, అమెరికన్ ప్రభుత్వం ఇండియన్ల పట్ల తన వైఖరి మార్చుకున్నది. ఇండియన్ టెరిటరీకి గానీ, లేదా ప్రాంతీయ రిజర్వేషన్‌లోగానీ తెగలన్నింటినీ ఒకే చోట ఉంచాలని భావించింది. 2.5 మిలియన్ ఎకరాల వైట్ మౌంటెన్ (అరిజోనా) ప్రాంతం నైరుతి అమెరికాలో ఉన్న అతిపెద్ద అపాచీరిజర్వేషన్‌గా అప్పటికే గుర్తింపు పొందింది. దీన్ని సాన్ కార్లోస్ ఏజెన్సీ అంటారు. పరిపాలనా సౌలభ్యానికి కేంద్ర కార్యాలయాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేశారు. చిరికాహువా రిజర్వేషన్‌లో కొందరు నియమాలను ఉల్లంఘిస్తున్నారని తెలిసి, అందర్నీ సాన్‌కార్లోస్ కు తీసుకురావాలని నిశ్చయించారు.

అయితే సాన్ కార్లోస్, జిల్లా నదుల సంగమ స్థానంలో ఉన్న ఈ ఏజెన్సీ కొందరు సైనికాధికారులకు నచ్చలేదు. "నది ఘట్టం నుండి ముప్పై అడుగుల ఎత్తులో ఉంటుందిది. చిన్న చిన్న బిల్డింగులు తప్ప మరేమీ లేవిక్కడ. ఎటుచూసినా మొక్కలు పెరగని బంజరుభూమి దర్శనమిస్తుంది. కాలువలు, నీళ్ల చలములు లేవు. వర్షం పడదు. బీటలు వారిన నేలమీద ఎప్పుడూ దుమ్ము పరచుకుని ఉంటుంది. వేసవిలో ఇక్కడ ఉష్ణోగ్రత 110 డిగ్రీల కన్నా ఎక్కువే. దోమలు, మిడతలు, ఇతర కీటకాలు(కొన్ని మిలియన్లలో) మన వునికిని నరకం చేస్తాయి" అంటూ యింటికి ఉత్తరం రాసుకున్నాడొక ఆఫీసర్.

1875లో ఇక్కడ ఏజెంట్‌గా పనిచేసిన జాన్ క్లమ్‌కు ఇండియన్లతో మంచి పరిచయాలే వున్నాయి. కొద్ది నెలల క్రితం ఎస్కిమింజన్ ఇతర అరపాహోలకు (కాంప్‌గ్రాంట్ వద్ద) సేద్యంలో మెళకువలు నేర్పించిందితడే. కాకపోతే ఇతనికి తలబిరుసెక్కువ. తన మొండితనంతో, వైట్ మౌంటెన్ రిజర్వేషన్ నుండి సైన్యాన్ని తొలగించి, అపాచీలకు ఏజెన్సీ రక్షణ బాధ్యతలు అప్పగించాడు. కోర్టులు ఏర్పరచి, అక్కడ అపాచీలనే తీర్పులు చెప్పమన్నాడు. పై అధికారులకు ఇతడి వ్యవహార శైలి నచ్చలేదు కానీ, సాన్ కార్లోస్‌లో శాంతి భద్రతలు సుస్థిరంగా వుండాలంటే, అపాచీలకిచ్చిన పరిమిత స్వేచ్ఛను ఆమోదించక తప్పలేదు.

ఇంకా వుంది....





జి. ఎల్. నరసింహారావు
హైకోర్టు న్యాయవాది, 9848994240

కుడిఎడమల దోపిడీ

లాయర్ గార్కి నమస్కారం. మీరు ఇస్తున్న సమాధానాలు తెలుసుకుని మాలో మేమే చాలా విషయాలు పరిష్కరించుకుంటున్నాం. ప్రస్తుతం మాకు ఓ సమస్య వచ్చింది. మాది వెనుకబడిన ప్రాంతం. మా గ్రామంలోకి రోజుకు రెండు, మూడు బస్సులు వచ్చి వెళ్తుంటాయి. మా గ్రామంలోని కిరాణా దుకాణంలో సబ్బు దగ్గర నుండి ప్రతి వస్తువుకు ఒకరూపాయి రేటు పెంచి అమ్ముతున్నారు. మేమేమన్నా అంటే మాకు వస్తువులు ఇచ్చే పరిస్థితి లేదు. మేము కొన్న ప్రతి వస్తువుపై ఒక రూపాయి అనగా ప్రతి నెలకు దాదాపు 100 రూపాయలు వసూలు చేస్తున్నారు. 500 కుటుంబాలు గల గ్రామంలో ఇలా ప్రతి కుటుంబాన్ని దోపిడీ చేస్తున్నారు. మేం పోలీసులకు చెప్పి సమస్య పరిష్కరించుకోవాలంటే. ఏం చేయాలో తెలుపగలరు.

సోమయ్య, మర్రిగూడ మండలం, నల్లగొండ జిల్లా.

ఏదైనా ప్యాకు చేసిన వస్తువుపై ఎం.ఆర్.పి రేటు, బ్యాచ్ నెంబరు, తూకం, తయారు చేసిన డేటు, దానిలో కలిపిన వస్తువులు (ఇంగ్రిడెంట్స్) కంపెనీ పూర్తి అడ్రస్ ఖచ్చితంగా ముద్రించాలి. దానిమీది ధరకంటే ఎక్కువ అమ్మినట్టయితే అది చట్ట ప్రకారం శిక్షార్హమే. ఇది పోలీసు పరిధిలోకి రాదు. తూనికలు, కొలతల పరిధిలోకి వస్తుంది. వారి దృష్టికి తీసుకొస్తే వారు తక్షణం కేసు పెట్టి అపరాధ రుసుము వసూలు చేస్తారు. ప్రతీ కేసుకు 1000 రూపాయల నుండి 5000/ - వరకు ఫైన్ వేస్తారు. ఈ ఆఫీసులు ప్రతి జిల్లా కేంద్రంలో ఉంటాయి. మీరు ఆఫీసుకు వెళ్లకుండానే కంప్లయింట్ చేయవచ్చు. ఫోన్ చేసి, ఏ షాపులో అలా చేస్తున్నారో చెప్పి, వారి అడ్రస్ , మీ అడ్రస్ కూడా (ఫోన్ నెంబర్) ఇస్తే మీకు మరలా ఫోన్ చేసి తీసుకున్న చర్యకూడా తెలుపుతారు. సాధారణంగా సినిమా థియేటర్లలో కూడా ఎక్కువ రేట్లకు అమ్ముతుంటారు. మీకు ఈ సమస్య ఎక్కడ ఎదురైనా ఆ నెంబరుకు చేయండి. మళ్లీ వ్యాపారులు ఆ తప్పలు చేయరు. ❄

ఎదుగూ బొదుగూ లేకుండా ఎంతకాలం!

నేను 1988 నుండి పోలీసు డిపార్టుమెంట్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాను. ఎదుగూబొదుగూ లేని జీతం, పై అధికార్ల తిట్లు తప్ప మాకు ప్రమోషన్స్ లాంటివి తక్కువ. మేము డిపార్ట్‌మెంటల్‌గాగానీ, మరేవిధంగా గానీ ప్రమోషన్స్ పొందలేమా, మాతోపాటు డిపార్టుమెంట్‌లో జాయినైన ఎస్ఐలు, డిఎస్‌పిలుగా మారుతున్నారు కానీ మా పరిస్థితి ఇలా ఉండవలసిందేనా తెలుపగరు?

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి 8 సంవత్సరాల తరువాత ప్రమోషన్ అవకాశం ఉంటుంది. అలా పొందినట్టయితే జీతం పెంచవలసి ఉంటుంది. కానిస్టేబుళ్లు కూడా పైస్థాయికి ప్రమోషన్ పొందిన వారు చాలా మంది ఉన్నారు. మీ డిపార్టుమెంట్‌లో మాత్రం పరిస్థితి దయనీయమైనదే. దీనికి న్యాయపరంగా ఏమీ చేయలేం. ప్రభుత్వాలే చర్యలు తీసుకోవలసి ఉంటుంది. ❄

ముదురు







టొమేటో ఎగ్

కావలసిన పదార్థాలు

టొమేటోలు - 100 గ్రాములు, కోడిగుడ్లు-4, ఉల్లిపాయలు-2, నిమ్మకాయ-1, ఉప్పు- చాలినంత నెయ్యి- 1 టేబుల్ స్పూన్, మసాలా - 1 టేబుల్ స్పూన్, వెల్లుల్లి - రెండు రెబ్బలు, పచ్చిమిర్చి- 10

తయారు చేసే విధానం

కోడిగుడ్లు వుడకబెట్టి రెండేసి చెక్కలుగా చేసుకొని వుంచాలి. టొమేటోలు పిసికి గుజ్జుగా చెయ్యాలి. ఉల్లిపాయ తరిగి పెట్టుకోవాలి. ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి నేతిలో వేయించాలి. తర్వాత మసాలా పొడి చేసి అందులో టొమేటో గుజ్జు, ఉప్పు, పచ్చిమిర్చి వేసి ఉడికించాలి. ఉడుకుతున్నప్పుడే కోడిగుడ్డు చెక్కలు వేయాలి. ఎక్కువ సార్లు కలదిప్పకూడదు. గుడ్డు చితికిపోతుంది. దింపేసిన తర్వాత నిమ్మకాయ పిండుకొని అన్నంలో తింటే చాలా రుచిగా వుంటుంది.

నల్లకారం

కావలసిన పదార్థాలు

మిరపకాయలు- గుప్పెడు, పచ్చి శనగపప్పు- చిన్న గరిట, ధనియాలు- చారెడు, జీలకర్ర- స్పూనున్నర, వెల్లుల్లిపాయలు- 5 గర్భాలు, కరివేపాకు- 4 రెబ్బలు, చింతపండు- నిమ్మకాయంత, ఉప్పు - సరిపడా నూనె- చిన్న గరిట

తయారు చేసే విధానం

ముందు మిరపకాయలు తొడిమలు తీసుకొని బాండీలో నూనె వేసి వేయించుకోవాలి. అలాగే కరివేపాకు కూడా వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి. ఒక స్పూను నూనెవేసి శనగపప్పు, జీలకర్ర వేయించుకోవాలి. చింతపండు గింజ లేకుండా రేకులుగా చేసి పెట్టుకోవాలి. మిక్సీ గిన్నెలో మిరపకాయలు, చింతపండు సగం ధనియాలు వేసి పొడుం కొట్టి రవ్వను జల్లెడతో జల్లించండి. కాస్త ఉండగా ఉంటుంది. మిగిలిన ధనియాలు, కరివేపాకు, ఉప్పు కూడా వేసి మరలా గ్రైండ్ చేయండి. మరలా జల్లించండి. అలా పొడి అయ్యే వరకు చేయండి. చివరకు చింతపండు పొట్టు జల్లెడలోకి వస్తుంది. అది పారేయండి. శనగపప్పు జీలకర్ర ఒక్కసారి తిప్పి కారంలో కలపండి. ఇది అన్నంలోకి, ఇడ్లీలోకి కూడా బాగుంటుంది.



చికెన్ కొబ్బరి పాల కూర

కావలసిన పదార్థాలు

చికెన్- ఒక కిలో (శుభ్రం చేసి ముక్కలు కోసి పెట్టుకోండి) కొబ్బరి కాయలు -1 1/2, కొబ్బరి కాయ తురుము- 1/2, ఎండు మిరపకాయలు- 15-20, ధనియాలు-రెండు టేబుల్ స్పూన్లు, జీలకర్ర- 1 టీ స్పూను, మిరియాలు- 1 టీ స్పూను, ఉల్లిపాయ పెద్దది- 1 తరిగినది, పసుపు- 1/4 టీ స్పూన్, వెల్లుల్లి రేకలు- 10, అల్లం ముక్క-1 అంగుళం, వెన్న-1 టేబుల్ స్పూన్, నిమ్మకాయ రసం- 1స్పూన్, తగినంత ఉప్పు, వేయించేందుకు, వడ్డించేందుకు-నెయ్యి- రెండు టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయ -1(నిలువుగా తరగండి), గరమ్ మసాలా-1/2 టీ స్పూన్

తయారు చేసే విధానం

ఒకటిన్నర కొబ్బరి కాయ ముక్కలను తురిమి రెండుకప్పుల వేడి నీరు పోసి, చిక్కని పాలు తీయండి. మిగిలిన పిప్పిలో మూడు కప్పుల వేడి నీరు పోసి, పలుచని పాలు తీసి పెట్టుకోండి. సగం కాయ కొబ్బరి తురుమును కొంచెం ఎర్రగా వేయించి తీసి పెట్టుకోండి. అందులో తరిగిన వుల్లి ముక్కలను కొంచెం నేతిలో దోరగా వేయించి తీసి ఎండు మిరపకాయలు, మిరియాలు, అల్లం, వెల్లుల్లి, పసుపు కలిపి కొంచెం పలుచని కొబ్బరి పాలు చల్లి మెత్తగా ముద్ద నూరి పెట్టుకోండి. మసాలా నూరిన రోటిని కప్పు నీటితో కడగండి. ఆ నీళ్లలో పలుచని కొబ్బరి పాలు, మసాలా ముద్ద కలపండి. శుభ్రంచేసిన చికెన్ ముక్కలను ఒక పాత్రలో తీసుకొని అందులో మసాలా కలిపిన కొబ్బరి పాలు, ఉప్పు, కొంచెం నెయ్యి వేసి, ప్రెషర్ కుక్కర్‌లో 5 నిమిషాలు వుడికించి దించండి. కుక్కర్ మూత తీసివేసి, చిక్కని కొబ్బరి పాలు, నిమ్మరసం, జల్లి కలిపి పొంగు వచ్చేలా వుడికించండి. ఆ పైన మంట తగ్గించి కాసేపు మగ్గనివ్వండి. ఒక కడాయిలో రెండు టేబుల్ స్పూన్ల నెయ్యి వేసి వుల్లి ముక్కలను దోరగా వేయించి, అందులో మగ్గిన కూర వేసి కలిపి, పైన గరం మసాలా పొడి జల్లండి. వేడిగా వడ్డించండి.



కాకరకాయ పులుసు

కావలసిన పదార్థాలు

కాకరకాయలు- 200 గ్రాములు, బెల్లం- నిమ్మకాయంత
చింతపండు- పెద్ద నిమ్మకాయంత, ఉప్పు -కొంచెం
పచ్చిమిర్చి- 4, కారం - చిటికెడు, పసుపు- చిటికెడు
ఉల్లిపాయలు- 2, జీలకర్ర- కొంచెం, ఆవాలు- కొంచెం
నూనె- 1 టేబుల్ స్పూన్, ఎండు మిర్చి- 4, వరిపిండి-1 టీ స్పూన్

తయారు చేసే విధానం

కాకరకాయలు సన్నని చక్రాల్లా కోసుకోవాలి. చింతపండు రసం తీసుకొని వుంచుకోవాలి. బెల్లం తరిగి వుంచాలి. కడాయిలో నెయ్యిపోసి బాగా కాగనివ్వాలి. అందులో ఎండుమిర్చి, పచ్చిమిరపకాయ ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, జీలకర్ర, ఆవాలు కొద్దిగా వేయించాలి. చిటపటలాడుతూ వుండగా కాకరకాయ ముక్కలు వేయాలి. మూత పెట్టి కాసేపు అలా వుంచితే బాగా మగ్గుతుంది. చింతపండు పులుసుతో బెల్లం పొడి, పసుపు, కారం పొడి ఉప్పు కలిపి కాకరకాయ ముక్కల మీద పొయ్యాలి. పులుసులో కాసేపు వుడకనిచ్చి ముక్క మెత్తబడిన తర్వాత దింపెయ్యవచ్చు. పులుసు కొంచెం దగ్గరగా ఇగిరితేనే ఈ కూర మంచిది. వుడుకుతూ వుండగా వరిపిండి వేస్తే పులుసు మరీ పలచగా వుండకుండా చిక్కగా తయారవుతుంది. రుచిగా వుంటుంది.



రంగు మార్చే పువ్వు





హాయ్ నేస్తాలూ, ఏం చేస్తున్నారు. మా దగ్గర ఒక తెల్లటి పువ్వు వుందర్రా! దానికి రంగులు మార్చే లక్షణం ఉంది. కావాలంటే మీరూ అలా చేయొచ్చు. మరైతే ఇవాళ అదెలాగో చెప్పేసుకుందామా.

ఏమేం కావాలంటే... నీళ్లు, కత్తెర, ఏమైనా రెండు రంగులు, పొడవాటి కాడవున్న తెల్లటి పూవు, ప్లాస్టిక్ గ్లాసులు రెండు.

ఎలాచేయాలంటే... రెండు గ్లాసులు తీసుకుని ఒక గ్లాసులో ఒకరంగు, రెండవ గ్లాసులో మరొక రంగు కలపాలి. రెండు గ్లాసులను పక్కపక్కన పెట్టాలి. పొడవాటి కాడ వున్న పువ్వును తీస్కోవాలి. కాడను నిలువుగా కట్ చేయాలి. చీల్చిన కాడలను బొమ్మలో చూపిన విధంగా ఉంచాలి. కొంత సేపటి తర్వాత గమనించండి. చిన్నగా పూల రెక్కల రంగు మారుతుంటుంది. మనం ఏరంగునీళ్లలో కాడను ఉంచామో ఆదే రంగు పువ్వుకి వస్తుంది. ఇలా ఏరంగైనా వేసి చూడండి మనం వేసిన రంగే పువ్వుకి వస్తుంది. ఇప్పడు మనం రెండు గ్లాసులలో రెండు రంగులు వేశాం కాబట్టి ఒకే పువ్వులో రెండు రంగులు కనిపిస్తాయి. ఈ ప్రయోగం ద్వారా మనకు మొక్కలు వాటి భాగాలు నీటిని పీల్చుకుంటాయని తెలుస్తుంది కదా!

పదాలు కనిపెడదాం

కింద ఇచ్చిన బాక్స్‌లో కొన్ని అక్షరాలు ఉన్నాయి కదా! వీటిలో నిలువుగా, అడ్డంగా, క్రాస్‌గా కొన్ని అక్షరాలు కలిపితే ఏడు పదాలు వస్తాయి. అవేంటో కనిపెట్టి సున్నా చుట్టండి.

X	Y	M	B	I	T	A	C	K	K	J
K	X	F	Y	O	F	A	S	O	K	D
S	X	T	M	T	T	C	B	M	W	H
R	R	A	N	A	T	B	S	P	K	H
H	T	O	T	C	D	W	L	Z	O	R
O	E	P	T	V	V	Z	O	P	I	F
R	K	E	M	C	S	G	J	N	D	N
S	S	E	C	Q	A	C	I	Z	L	W
E	A	H	C	F	X	R	B	K	Y	K
C	B	S	L	M	Q	X	T	L	R	A

జవాబులు:-
tomato, cow, tractor, horse, sheep, basket, cat

ఏం కనిపిస్తోంది?



ఇక్కడ ఒక చెయ్యి కనిపిస్తోంది కదా. కానీ అందులో మరేదో బొమ్మ వున్నట్టుందే? ఏంటి పిల్లలూ మీకు కూడా కనిపిస్తోందా? అదేంటో క్షణంలో చెప్పేయాలి మరి.

జవాబు: సింహం

బాలనేస్తాలు

పెంగ్విన్ వేద్దాం



హాలో ఫ్రెండ్స్... మీకు పెంగ్విన్ బొమ్మ వేయటం వచ్చా. ఏంటీ రాదా? చాలా సింపుల్ తెల్సా. ఇదుగో ఇక్కడ మేం చెప్పినట్టు చేస్తే మీకు పెంగ్విన్ వేయటం ఇట్టే వచ్చేస్తుంది. రెడీనా...

ఎలా కనిపెట్టాడు ?

ఒక కాంట్రాక్టర్ రెండంతస్తుల బిల్డింగ్ కట్టాడు. ఎలక్ట్రీషియన్ కరెంట్ వైరింగ్ చేయడంలో పొరపాటుపడి పై అంతస్తులో ఉన్న మూడు బల్బులకు కూడా కిందనే స్విచ్‌లు పెట్టాడు. ఇప్పుడు ఆ కాంట్రాక్టర్ ఎవరి సహాయం తీసుకోకుండా ఒక్కసారి మాత్రమే పైకి ఎక్కి ఏ బల్బ్‌కు ఏ స్విచ్చో కనిపెట్టాడు. ఎలా?

జవాబు :-

ఆ కాంట్రాక్టర్ సారి ఒక స్విచ్ వేసి ఐదు నిమిషాల తర్వాత స్విచ్ఛాఫ్ చేశాడు. తర్వాత రెండవ స్విచ్ వేసి పైకి ఎక్కి చూశాడు. ఇప్పుడు వేసిన స్విచ్ బల్బ్ వెలుగుతూనే ఉంటుంది కదా, అంతకుముందు ఐదు నిమిషాలు వేసి తీసిన బల్బ్ కొంచెం వేడిగా ఉంటుంది. పట్టుకుని చూస్తే ఏ బల్బ్ ఐతే వేడిగా ఉంటుందో ఆ బల్బ్ మొదట వేసిన స్విచ్‌దని తెలిసిపోతుంది. ఇక మిగిలింది మూడవ స్విచ్, దాని బల్బ్ మాత్రమే. ఈ విధంగా ఒక్కసారి మాత్రమే ఎక్కి మూడు బల్బ్‌ల స్విచ్‌లను తెలుసుకున్నాడు.

బ్యాగ్ కావాలా!



చేసేద్దాం



నేస్తాలూ! మీకు హ్యాండ్ బ్యాగ్ అంటే చాలా ఇష్టమా! మరైతే ఎలా చేయాలో చెప్పకుందామా.

కావలసినవి ... పాత టీ షర్ట్, కత్తెర, పెన్సిల్

చేయాల్సిన పద్ధతి... టీ షర్ట్‌లోంచి ఏడు అంగుళాల పొడవు,వెడల్పు ఉన్న బట్టను కత్తిరించి తీసుకోండి. దానిపై ఒక సున్నా గీసుకోవాలి. దాని చుట్టూ వెలుపల సమాన దూరంలో కొన్ని గుర్తులు పెట్టుకోవాలి. క్లాత్‌కి రెండు చివరలు సర్కిల్‌కి వెలుపల హృదయాకారంలో గీసుకొని గుర్తు పెట్టుకోవాలి. ఈ గుర్తుల చుట్టూ త్రికోణాకారంలో కట్ చేసుకోవాలి. హృదయాకారాలలో రెండు వైపులా రెండేసి రంధ్రాలు చేసి వాటిలోనికి దారాన్ని (పట్టుకోవడానికి వీలుగా హాండిల్‌మాదిరిగా) దూర్చాలి. రెండు వైపులా పట్టుకోవడానికి వీలుగా దారాలు కట్టాలి. తరువాత సర్కిల్ చుట్టూ పెట్టుకున్న గుర్తులపై రంధ్రాలు చేసి వాటిలో కూడా దారాన్ని దూర్చుకుంటూ వచ్చి మొదట మొదలుపెట్టిన ప్రదేశానికి వచ్చిన తర్వాత రెండు కొనలను కలిపి దారం మొత్తాన్ని లాగి క్లాత్ అంతా ఒకదగ్గరకు వచ్చేలా ముడివేయాలి. ఇదంతా కనిపించకుండా లోపలికి తిప్పి కుట్టుకోవాలి. ఇప్పుడు ఇది సంచిలా ఉంటుంది. మొదట హృదయాకారంలో కట్‌చేసి దారం హాండిల్ లా దూర్చి పెట్టుకున్న వాటిని ముడివేసుకోవాలి. ఇప్పుడు చూడండి మీకు మంచి హ్యాండ్‌బ్యాగ్ రడీ అయింది. ఇక మీదే ఆలస్యం.... ఈ బ్యాగ్‌లో ఏం పెట్టుకుంటారు? మీ దగ్గర ఉన్న బుల్లి, బుల్లి వస్తువులు ఏమైనా దీన్లో దాచుకోవచ్చు కదా? సో.... ఇక మొదలెట్టేస్తున్నారు కదూ బ్యాగ్ చేయడం.



జెపి వైద్య

కుటుంబ సభ్యులతో రఫీ...



సంగీతవనంలో రఫీ జ్ఞాపకాలు!

ఆ రోజుల్లో అంతటా 'కుందన్‌లాల్ సైగల్' క్రేజ్ ఉండేది. భారతీయ హిందీ సినీ సంగీత ప్రపంచపు ధృవతారల్లా వెలిగిన లతా, రఫీ, ముఖేష్, కిషోర్... అందరూ సైగల్ వీరాభిమానులే!

సైగల్ సంగీత విభావరి సాగుతోంది ఓ చోట! దురదృష్టం కొద్దీ మైకులు పని చేయలేదు. సైగల్‌కు చిర్రెత్తింది. 'నేను పాడను' అని భీష్మించుకుని కూర్చున్నాడు. సభలో కలకలం. హమీద్ నిర్వాహకుల చెవుల్లో గుసగుసలాడాడు 'మైకులవీ సిద్ధమయ్యేదాకా మావాడిని స్టేజి ఎక్కించమంటారా? ' అని.

మైకు లేకుండా రఫీ గొంతు ఆఖరు వరుసదాకా చేరింది. సైగల్ కదిలిపోయి లేచాడు. రఫీని అక్కున చేర్చుకుని 'బహుత్ అచ్ఛీ! ఇలాగే పాడితే నన్ను మించిపోతావు ఒక రోజు' అని ఆశీర్వదించాడు.

రఫీ 'హిందీ సినీ సంగీతం దునియాలో' తర్వాతి రోజుల్లో తిరుగులేని చరిత్ర సృష్టించాడు.

"బతికున్న వాళ్ల ఇష్టవేం ఇలా ఏడుస్తుంటే చచ్చిన వాళ్ల ఇష్టాయిష్టాల్తో ఏం పని?" - అని కన్యాశుల్కంలో గురజాడ వారన్నారు. ఇష్టాయిష్టాలు... పుర్రెకో ఆలోచన, జిహ్వకో రుచిలా రకరకాలుగా ఉంటాయి. కొందరికి గులాబీలు ఇష్టం... కొందరికి మల్లెలు ఇష్టం... కాని, 'వెన్నెల' ఇష్టం లేనిది ఎవరికనీ? అలాగే, సినీ సంగీతం దునియాలో 'రఫీ తడాఖా' తెలియనిదెవరికీ? రఫీ మా చిన్నప్పటి 'దోస్త్'! అది కేవలం 'మాకే' తెలుసు. ఆయనకు అప్పుడూ తెలియదు. ఇప్పుడున్న వాళ్లకు ఎప్పుడూ తెలియదా సంగతి. చిన్నప్పుడు మోకాళ్లు జారి 'సదా స్థానభ్రంశం' చెందే చెడ్డీని ఒక చేత్తో సవరిస్తూ, మరో చేత్తో 'మొండి క్రికెట్ బ్యాటు'ను బ్యాలెన్స్ చేసే రోజుల్లో 'యాహూccc' అనే 'గావుకేక' సినిమా అడ్వర్టైజుమెంటు 'రిక్షా' లోంచి విన్పించేది. అందరం తెగ దడుసుకునేవాళ్లం. ఇంటి పక్క 'కులకర్ణిగారి' విశాలమైన గోడకు శరపరంపరల్లా ' సినిమా పోస్టర్లు' అంటించి జారుకునే వాడు 'న్యూథియేటర్' చావూస్.

"థూ..థూ...! ఏం దరిద్రం సిన్మాలూ...? ఏం పేర్లు.. జంగ్లీ! బత్తమీజ్!!" అంటూ 'కులకర్ణిణీ' నీళ్లూ + చీపుళ్లతో 'నాన్‌స్టాప్ కాంమెట్రీ' సాగించేది. 'యాహూccc' అన్న గావుకేకకు 'షాక్ తిన్నట్టు' మంచులో వెనక్కి ధామ్మని పడ్డ సైరాభాను 'అందాలు' మాకు కాలేజీకెళ్తే కాని తెలవలేదు.

అప్పటిదాకా 'చలి చలిరే పతంగ్ మెరీ చలీరే' (బాభీ) తో చిరు పరిచయం. 'ఫ్యామిలీ ప్లానింగ్ స్లోగన్' లా మాయింట సినిమాలు సంవత్సరానికి ఒకటి లేక రెండు మాత్రమే. మా బాల్యం అందుకే పుష్కలంగా 'సినిమా పోస్టర్ల' అవలోకనతోనే గడిచిపోయింది. జామ చెట్టుకింద అరుగుమీద 'పూణే' నుంచి వచ్చిన 'కజిన్స్' మా మెదడ్లో 'రఫీ-ముఖేష్-కిషోర్' లను నూరిపోశారు. అలా 'సినిమా'ల్లో పాడే రఫీ ట్రైన్లో మా కజిన్స్ వెంబడి మా ఇంటికొచ్చి ఇక్కడి వాడైపోయాడు శాశ్వతంగా. అది ఆయనకు తెలీదు. 'బోంబే'లోని బాలివుడ్డో'ళ్లకూ తెలీదు.

కాలేజీలో 'మార్నింగ్‌షో' -లూ 'మ్యాట్నీషో' లతో పరిచయం! అది మా 'జనరల్ నాలెడ్జ్' ను ఎంతో నింపేసింది.

'మెడికల్ కాలేజీ ముందు' ఖయ్యూమ్ కేఫ్'లో 'బినాకా గీత్ మాలా' తో, మేము 'సినీ దునియా వాళ్ల'తో చెట్టాపట్టాలేసుకుని తిరిగినంత ఎదిగిపోయాం. కాలేజీలో 'నోట్స్' రాయని వాళ్లు సైతం 'బినాకా టాప్ గీతం' వస్తే తల వంచుకుని గబగబా గీకేసేవాళ్లు. తర్వాత, గంటలకొద్దీ 'హై. రఫీ ఓన్లీ?' అని తలలు బద్దలయ్యేలా

వాదించేవాళ్లు. వైద్యశాస్త్రంలో 'మెడల్స్' మిస్ అయినా హిందీ సినీ దునియాలో మాది 'గోల్డ్ మెడలిస్ట్' అంతటి జ్ఞానం. పెద్దోళ్ల దృష్టిలో 'వేస్ట్‌గాళ్లం'. అందరికీ 'రఫీ' కున్నట్టు పెద్దన్నయ్యలూ. తండ్రీ ఉండరుగా మరి!

కోట్లాలో పుట్టి....

రఫీ పుట్టింది 'కోట్లా సుల్తాన్‌పూర్‌లో'! అవిభక్త పంజాబ్‌లోని 'అమృతసర్' దగ్గర. తండ్రి హాజీ అలీ మొహమ్మద్, పెద్దన్నయ్య హమీద్ ల నిశితమైన చూపులు 'చిన్నారి రఫీ' మీద ఉండేవి. రఫీ ముద్దు పేరు 'ఫీకో'...! 'పాటలు పాడుతూ వూళ్లో సంచరించే ఫకీర్ల వెంట అనుకరణ గీతాలు పాడ్తూ పరిగెత్తడం' అలవాటు. రఫీ పుట్టిన తర్వాత (డిసెంబర్ - 24 - 1924) పదేళ్లకు 'కుటుంబం' లాహోర్‌కు వలస వచ్చింది. అక్కడి 'నూర్ మొహల్లా'లో వారిది ఒక 'సెలూన్'!

రఫీ 'సెలూన్' లో క్షణం నిలకడగా ఉండేవాడు కాదు. సంగీతం, సైగల్ గీతాలను 'గున్ గునాయించడం', ఫకీర్ల వెంట నీడలా కదులుతూ 'సూఫియా కలామ్' లు నెమరేయడం గమనించి, పెద్దవాళ్లు హిందుస్తానీ శాస్త్రీయ సంగీతం నేర్పే ప్రయత్నం చేశారు.

ఉస్తాద్ బడే గులామ్ అలీ ఖాన్, ఉస్తాద్ అబ్దుల్ వాహిద్ ఖాన్, పండిట్ జీవన్ లాల్ మట్టో, ఫిరోజ్ నిఝామీల దగ్గర నేర్చుకున్నాడు రఫీ.

మొట్ట మొదటి సారి పాడిందిక్కడే

ఆ రోజుల్లో అంతటా 'కుందన్‌లాల్ సైగల్' క్రేజ్ ఉండేది. భారతీయ హిందీ సినీ సంగీత ప్రపంచపు ధృవతారల్లా వెలిగిన లతా, రఫీ, ముఖేష్, కిషోర్... అందరూ సైగల్ వీరాభిమానులే!

సైగల్ సంగీత విభావరి సాగుతోంది ఓ చోట! దురదృష్టం కొద్దీ మైకులు పని చేయటంలేదు. సైగల్‌కు చిర్రెత్తింది. 'నేను పాడను' అని భీష్మించుకుని కూర్చున్నాడు. సభలో కలకలం. హమీద్ నిర్వాహకుల చెవుల్లో గుసగుసలాడాడు 'మైకులవీ సిద్ధమయ్యేదాకా మావాడిని స్టేజి ఎక్కించమంటారా? ' అని.

మైకు లేకుండా రఫీ గొంతు ఆఖరు వరుసదాకా చేరింది. సైగల్ కదిలిపోయి లేచాడు. రఫీని అక్కున చేర్చుకుని 'బహుత్ అచ్ఛీ! ఇలాగే పాడితే నన్ను మించిపోతావు ఒక రోజు' అని ఆశీర్వదించాడు.

రఫీ 'హిందీ సినీ సంగీతం దునియాలో' తర్వాతి రోజుల్లో తిరుగులేని చరిత్ర సృష్టించాడు. అది వొట్టి సువర్ణాక్షరాల రాతకాదు. రత్నాలూ, మణులూ పొదిగిన 'సినీ సంగీత గాత్రం' అది. రఫీ మనలను వీడిపోయి 28 సంవత్సరాలై పోయినా మరో 'మొహమ్మద్ రఫీ' పుట్టలేదింకా! పుడ్తాడన్న నమ్మకమూ లేదు!

తొలి గీతం ఏది?

రఫీ మొట్టమొదట గీతం ఏదీ? అన్న ప్రశ్నకు గొడవ గొడవల జవాబులున్నాయి. 1944 లో రిలీజైన పంజాబీ చిత్రం 'గుల్ బలోచ్' లో జీనత్‌బేగం తో కలిసి

రఫీని వరించిన పురస్కారాలు

1948 భారతదేశపు తొలి వార్షికోత్సవం సందర్భంగా తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చేత వెండి మెడల్ , 1965- పద్మశ్రీ, 1968 బెస్ట్ మేల్ ప్లేబ్యాక్ సింగర్ - జాతీయ పురస్కారం, (చిత్రం -నీలక్‌మల్/సంగీతం-రవి), 1977- బెస్ట్ మేల్ ప్లేబ్యాక్ సింగర్- జాతీయ పురస్కారం (చిత్రం -హమ్ కిసేసే కమ్ నహీ (క్యా హువా తేరా వాదా) , సంగీతం- ఆర్.డి. బర్మన్ / గీతం మజరూహ్ సుల్తాన్ పురి)

ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్: 1960: బెస్ట్ మేల్ ప్లే బ్యాక్ అవార్డ్ (చౌదవీంకా చాంద్ హో - టైటిల్ గీతం)- రవి, 1961: బెస్ట్ మేల్ ప్లే బ్యాక్ అవార్డ్ 'తెరి ప్యారీ సూరత్‌కో - ససురాల్) శంకర్ జైకిషన్, 1964: బెస్ట్ మేల్ ప్లే బ్యాక్ అవార్డ్ (చాహుంగా మై తుఝే- దోస్తీ) లక్ష్మీకాంత్ ప్యారేలాల్, 1966: బెస్ట్ మేల్ ప్లే బ్యాక్ అవార్డ్ (బహారో ఫూల్ బర్సావో - సూరజ్)- శంకర్ జైకిషన్, 1968- బెస్ట్ మేల్ ప్లే బ్యాక్ అవార్డ్ (మై గావూం తుమ్ సోజావో -బ్రహ్మచారి)- శంకర్ జైకిషన్ , 1977 : బెస్ట్ మేల్ ప్లే బ్యాక్ అవార్డ్ (క్యాహువా తేరా వాదా - హమ్ కిసీసే కమ్ నహీ) -ఆర్.డి. బర్మన్.

భార్య, కుమార్తెతో...

గానం చేసిన 'సోనియే నీ... హీరియేనీ' అనే డ్యూయెట్‌కు సంగీతాన్ని శ్యామ్ సుందర్ సమకూర్చాడు.

న్యాయంగా అదే మొదటి పాట!

రఫీ తండ్రి అలనాటి ప్రముఖ సుప్రసిద్ధ సంగీతకారుడు 'నౌషాద్ అలీ' పేర్న ఒక పరిచయ పత్రం రాసి పంపాడు. అబ్దుల్ రషీద్ కార్‌దార్, మెహెబూబ్ ఖాన్, నటుడు- దర్శకుడూ అయిన నజీర్ లాంటి వారి పరిచయం ఏర్పడింది. నౌషాద్ సంగీతంలో సాగిన 'హిందూస్థాన్ కె హమ్ హై' గీతం కోరస్‌లో 'రఫీ' గొంతు కొట్టొచ్చినట్టు విన్పించింది. 'పహలే ఆప్' (44) ఏ. ఆర్. కార్‌దార్ గీతాల్లోనూ రఫీ విన్పిస్తాడు సూక్ష్మంగా!

'గాంవ్ కి గోరీ' (44) సంగీతం 'శ్యామ్ సుందర్' సమకూర్చాడు. 'అజీ... దిల్‌హో కాబూ మేఁ' జి.యమ్. దుర్రానీ తో కలిసి గానం చేసిన గీతం రఫీ తొలి హిందీగీతం .... అని కొందరు వాదిస్తారు.

వాదోపవాదాలకు అతీతంగా 1952 లో 'బైజూ బావరా' వచ్చింది.

-' ఓ దునియాకే రఖవాలేఁ'

-'మన తడపత్ హరి దర్శన్ కో ఆజ్' విన్న యావత్ భారతదేశపు సినీ రసికులు దిగ్గున లేచి కూర్చున్నారు.

'బినాకా గీత్ మాలా' ఆరోజుల్లో హిందీ గీతాలను ఇంటింటికీ పంపి, గుండెల్లో గూడును కట్టించే పని చేసింది.

అప్పుడు మన గుండెల్లో 'బందీ' అయిన 'మొహమ్మద్ రఫీ' నేటికీ అమరుడే! 1950-60 ప్రాంతంలో రఫీ గీతాలు ప్రతి సంగీత రసికుడి గళంలో తాయత్తులే! తాయత్తులను నమ్మని వాళ్లు నేరుగా గుండెల్లో, మనస్సులో దాచుకున్నారు 'రఫీ'ని. ఓ.పి నయ్యర్, శంకర్ జైకిషన్, సచిన్ దేవ్ బర్మన్, రఫీ, మదన్ మోహన్, లాంటి సంగీత కారులు 'రఫీ' గొంతును అభిమానించారు. నౌషాద్ హిందీ సంగీత ప్రపంచపు కురువృద్ధుడు. రఫీ లేనిది ఆయన గీతం పలికేది కాదు.

ఓ.పి.నయ్యర్ అయితే ఏకంగా రఫీ పాటను కిషోర్ కుమార్ కోసం వాడారు. అది 'మన్ మొరా బావరా'! 'రాగిణి' సిన్మా కోసం. ఆ తర్వాత కిషోర్ చిత్రాలకు రఫీ గొంతే వాడారు - 'బాగీ' - 'షహజాదా' - 'షరారత్'లు ఆ సినిమాలు!

1950-60 లో 'నయ్యర్' జాదూ వ్యాపించింది.

'నయాదౌర్' (1957) - 'మాంగ్ కే సాధ్ తుమ్హారా - మైనే మాంగ్ లియా సంసార్'
"ఉడే జబ్ జబ్ జుల్ఫేం తేరీ'
'తుమ్ సా నహి దేఖా' (57) - 'యూఁ తో హమ్నే లాఖ్ హసీఁ దేఖే హై' - 'సిర్ పే టోపీ'
'కాశ్మీర్ కీ కలీ' (64) - 'దీవానా హువా బాదల్'
- 'తారీఫ్ కరూఁ క్యా ఉస్‌కీ'

ఓ.పీ. నయ్యర్ సంగీతంలో రఫీ ఒకటో- రెండో కాదు ఏకంగా 56 సోలో గీతాలూ, 140 కు పైగా యుగళ గీతాలూ పాడాడు. అన్నీ పాపులర్ గీతాలే! కాని, ఒక్క గీతంలోనూ 'లతా' గొంతు లేదు. అది 'నయ్యర్ - రఫీ - ఆశా' ల మార్క్ సంగీతం ధూమ్ ధడాకా అన్నమాట! మీసాలు 'నీట్‌గా' తీసి 'డ్యాషింగ్, పుష్షింగ్, గ్లామరస్ 'పాత్రల్లో షమ్మీ కపూర్‌కు' న భూతో న భవిష్యత్ రంగు - రూపు వెనక 'రఫీ' గొంతు ఉంది.

మనం అలాంటి మరో హిట్ సంగీతకారుల జోడి 'శంకర్ జై కిషన్'ల సంగీతంలో 'రఫీ' షమ్మీ కోసం చేసిన హడావుడిని గమనిద్దాం.

"యాహూ" అని 'జంగ్లీలో' గావుకేక వేసింది ప్రయాగ్ రాజ్. ఆయన పేరు ఎంత మందికి జ్ఞాపకం ఉందో తెలియదుకాని,



'యాహూఁ' అన్న గోలకు 'ధామ్మని' వెనక్కి పడ్డ 'సైరా బానూ'తో పాటు లక్షల కోట్ల దీవానాలు 'షమ్మీ' వెంట రఫీ' గొంతు వెంట పిచ్చిగా పడిపోయారన్నది చరిత్రకెక్కిన సత్యం.

కొన్ని గీతాలను ఓపిగ్గా నెమరేసుకుందాం...

- యాహూ... చాహె ముఝె కొయి జంగ్లీ కహే' (జంగ్లీ/1961)

-'నజర్ బచాకర్ చలే గయేవో' (దిల్ తెరా దీవానా/62)

'ఏ... గుల్ బదన్/ ఆవాజ్ దేకే హమేఁ తుమ్ బులావో' (ప్రొఫెసర్/62)

'ఇస్ రంగబదలతీ దునియామే / దిల్ రుబా... దిల్ పే తూ' (రాజ్‌కుమార్ / 64)

'లాల్ ఛడీ/ తుమ్‌సే అచ్ఛా కౌన్‌హై' (జాన్వర్/65)

'రాత్ కే హమ్ సఫర్' (ఈవినింగ్ ఇన్ ప్యారిస్/67)

'సవేరే వాలీ గాడీసే / ఇ చాంద్ జరా ఛుప్ జా' (లాట్ సాహెబ్/67)

'దిల్ కే ఝురోఖోంఁపే / ఆజ్ కల్ తెరే మెరే ప్యార్‌కే చర్చే (బ్రహ్మచారి/68)

బధన్ పే సితారే (ప్రిన్స్/69)

ఇలా వివరిస్తూ పోతే పేజీలు చాలవు.

'దేవానంద్' కోసం 'సచిన్ దేవ్ బర్మన్' గారు తర్వాతి రోజుల్లో కిషోర్ గొంతును వాడినా తొలినాటి ఎవర్ గ్రీన్ ఫేవరేట్ 'రఫీ' యే!



ఆశాతో...

-హమ్ బేఖుదీ మే తుమ్‌కో'
(కాలాపాని)
'ఖోయా ఖోయా చాంద్' (కాలాబజార్)
'దిల్ కా భంవర్ కరే పుకార్' (తెరే ఘర్ కే సామ్నే)
'తెరే మెరే సప్నే అబ్ ఏక్ రంగ్‌హై' (గైడ్'
'ఇసె తొ న దేఖో' (తీన్ దేవియా!)

ఆ మధ్య 'రాయల్టీ' అంశం మీద రఫీ-లతాల మధ్య భేదాభిప్రాయాలేర్పడ్డాయి. వాళ్ళిద్దరు 'డ్యూయెట్లు' పాడటం మానేశారు. 'బర్మన్‌దా' చొరవ తీసుకొని వారిద్దరితో 'జ్యువెల్ థీఫ్' కోసం 'యుగళగీతం' పాడించారు. కాస్తంత ఎడ మొహం, పెడమొహంతో పాడినా, మనలాంటి దీవానాలు పిచ్చిగా రెచ్చిపోయి విన్నాం..... మబ్బుల మీద ప్రయాణం చేశాం.

ఆ సదాబహార్ గీతం 'దిల్ పుకారే'cc ఆరేcc ఆరేcc!

శంకర్ జైకిషన్ సంగీత దర్శకత్వంలో 'రఫీ' దేవానంద్ కోసం పాడిన గీతాలు అనేకం. స్థలాభావంతో కొన్ని సర్దేస్తాను.

-'తెరీ జుల్ఫోంసె జుదాయీ' (జబ్ ప్యార్ కిసీసే హోతాహై /61)
-తుఝే జీవన్ కీ డోర్‌సే బాంధలియాహై' (అసలీ - నకలీ/62)
రాజేంద్రకుమార్ కోసం 'రఫీ' అత్యద్భుతమైన గీతాల నందించాడు-కొన్నింటిని తలచుకుందాం.
-'తెరీ ప్యారీ ప్యారీ సూరత్‌కో' (ససురాల్/1961)
'యాద్ న జాయే బీతే దినోంకి' (దిల్ ఏక్ మందిర్ / 63)
'ఏ ఆసూ మేరే దిల్ కి జుబాన్ హై' (హమ్ రాహీ/63)
'ఏ మెరా ప్రేమ్ పత్ర్ పఢ్‌కర్' (సంగమ్ /64)'ఏ-నర్గిసే మస్తానా/ పూలోంకి రాణి (ఆర్జూ/65)
'ఆజ్‌కి రాత్/ అమన్‌కా ఫరిష్తా' (అమన్/1967)
'బహారోc ఫూల్ బర్‌సావో' (సూరజ్)

రఫీ కేవలం హీరోలకే పరిమితం కాలేదు.

'చంపీcc తేల్ మాలిష్.. సర్ జో తెరా చక్ రాయే' లాంటి గొంతు నొక్కుడు గీతాలతో 'జానీవాకర్'కూ- 'హమ్ కాలేహైతో క్యాహువా' లాంటి 'గుమ్ నామ్'లోని గళ్ళ లుంగీ మెహమూద్‌కు కొత్త రూపాన్ని అందించిన విలక్షణమైన గొంతు రఫీది. నౌషాద్ అలీ - దిలీప్‌ల టాప్ ఫేవరేట్ 'ఆల్ ది టైం రఫీ' యే!

'మొహబ్బత్ కి రాcహోc మే చల్నా సంభాల్ కే' నుంచి 'మేరే మెహబూబ్' దాకా 'దిల్ దియా దర్ద్ లియా' నుంచి 'కోహినూర్'- 'లీడర్' దాకా వారిదే రాజ్యం.

'మధుబన్ మె రాధికా' ఎవరు మరచిపోతారు?

మదన్ మోహన్ ఎంత 'లతామయం' అయినా 'రఫీ' గానం చేసిన 'తెరి ఆంఖోకే సివా'- 'రంగ్ ఔర్ నూర్‌కి బారాత్' ఎలా మరచిపోతాం?

రఫీ 'రవి' సంగీతంలో అందించిన మేలిమి రత్నాలు' చౌదవీకా చాంద్‌హో!' 'బాబుల్‌కి దువాయేc లేతీ జా' మరచిపోవడం ఎవరి తరం?

శంకర్ జైకిషన్ -రాజకపూర్ లాంటి దిగ్గజాల 'సంగం'లోని 'ప్రేమ పత్ర్' పాటను కాదని, ఫిలింఫేర్ అవార్డ్ సొంతం చేసుకున్న 'లక్ష్మీకాంత్-ప్యారేలాల్' 'దోస్తీ'లోని మధుర గీతాలను మరచిపోతే మనం నిజంగా వింత పశువులమే!

'ఎవరు ఎక్కువ గీతాలు పాడారు?' అనే 'గిన్నిస్ రికార్డ్' రేస్‌లో రఫీ- లతా ఎంత గొడవ పడ్డా- గొడవలు చేయని 'బుద్ధి మంతులైన మన లాంటి ఫిల్మీ సంగీతం దీవానా'లకు వాళ్ళిచ్చింది. దోసిళ్ళ కొద్దీ....!

ఎన్ని తరాలు దోసిళ్ళు పట్టుకొని నిల్చున్నా....- ఆ పెన్నిధి కరిగిపోదు. తరిగి పోదు. 'బాబుల్‌కి దువాయే లేతీజా' పాడుతూ రఫీ బావురుమన్నాడు.

'ఓకే... వెళ్తాను...'

కిషోర్ హవా ఉన్నా సర్దుకొని అంతే దీటైన, మేలిమి బంగారం గీతాల నందించాడు. 1980 జులై 31 నాడు 'షామ్ ఫిర్ క్యోం ఉదాస్ హై దోస్త్' పాట రికార్డింగ్ చేసి లక్ష్మీకాంత్-ప్యారేలాల్‌తో 'ఓకే. వెళ్తాను' అన్నప్పుడు ఎవరూ ఊహించలేదు.

గుండెపోటుతో 'రఫీ' నిజంగానే వెళ్ళిపోతాడని!

కోట్ల కొద్ది రసికుల కన్నా జోరుగా ఆకాశం భోరున విలపించింది. పోయినోళ్ళు అందరూ మంచోళ్లే... వెనక మిగిల్చి వెళ్ళిన తీపి గుర్తుల 'సంగీతం ఖజానా'ను అను నిత్యం అనుభవించే మనం? రఫీ లవర్స్ మంచోళ్ళు కాకుండా ఉంటారా ఏమి? ❄



భార్యతో...



లతాతో...

కథ

ఎస్. వీరమల్లికార్జున

కథా నిలయం

విరాగి!

"మీరేం ఇవ్వొద్దు బాబూ. మీకు కావాల్సినంత తేనె తెచ్చిస్తాను. మా అయ్య రోజూ తెచ్చి అమ్మటానికి పట్నం తీసుకెళ్తుంటాడు. మీరలా ఎవరితో మాటాడకుండా ఉండడం మంచి పద్ధతి కాదు. ఎవరితో మాట్లాడకుండా ఎవరితో పలకరింపు లేకుండా బ్రతికే బ్రతుకులో ఆనందం ఏం ఉంది? అందరితో సంతోషంగా ఉండాలి. మన కష్టాలు చెప్పకోవాలి. ఎదుటి వాళ్ళ కష్టాలు తెలుసుకోవాలి. మనం ఏ సాయం చేయలేకపోయినా ఎదుటి వాళ్లకి ధైర్యం చెపుతుండాలి" అన్నది.

ఎంతో దూరం నుండి వస్తున్న ఓ యువకుడు ఆ కోయ గూడెం సమీపంలో ఆగాడు. దాహం వేయడంతో దగ్గర్లో ఉన్న ఒక గుడిసె ముందుకు వెళ్ళాడు.

"అయ్యా లోపల ఎవరు? దప్పికగా ఉంది. కాసిని మంచినీళ్ళు ఇస్తారా?" అనడిగాడు.

ఇంటి లోపలనుండి మధ్య వయస్కుడైన యజమాని "ఎవరో పాపం ఎండన పడి వచ్చినట్టుంది. మంచి నీళ్లంట ఇవ్వండి" అన్నాడు. ఇంటి లోపలనుండి ఓ పదహారేళ్ళ అమ్మాయి మంచినీళ్ళ చెంబు, గ్లాసుతో వచ్చింది. గ్లాసుతో మంచినీళ్ళివ్వగానే తాగాడు. మట్టికుండలోని నీరు కావడంతో ఫ్రిజ్ వాటర్‌లా ఉన్నాయి. మళ్ళీ మళ్ళీ కావాలని కడుపు నిండా దాహం తీరే వరకూ తాగాడు.

"ఏ ఊరు బాబూ యాడికి పయనం? సూడబోతే పట్నపోళ్ళులాగా ఉన్నారు?" అడిగాడు ఇంటి యజమాని.

"నేను చాలా దూరం నుంచి వస్తున్నాను. నేనిక్కడే ఉండి పోయేందుకు వచ్చాను. నేనిక్కడే వుండి 'సాధన' చేసేందుకు వస్తున్నాను" అన్నాడు ఆ యువకుడు.

"సాధన అంటే?..."

"సాధన అంటే తపస్సు"

"ఈ వయస్సులో తపస్సు ఏవిటి బాబూ. సూడబోతే ఇరవై ఏళ్ళుకూడా లేవు" ప్రశ్నించాడు యజమాని.

"నేను తపస్సు చేసేది మనశ్శాంతి కోసం గతంలో జరిగినవి మరచి పోయేందుకు. మీకు డబ్బులిస్తాను. నాకొక గుడిసె వేసివ్వండి" అంటూ బ్యాగులోంచి ఓ వెయ్యి రూపాయలు తీసి ఆ ఇంటికి యజమాని కిచ్చాడు.

"బాబూ మీ పేరు..."

ప్రభు లింగం. అది పరమ శివుని పేరు . మా నాన్న సోమనాధ శర్మ ఆ పేరు పెట్టాడు నాకు" అని చెప్పి అక్కడే మట్టితో చేసిన అరుగుమీద కూర్చుండిపోయాడు.

ooo

ప్రభులింగంకు నాలుగైదు రోజుల్లోనే గుడిసె తయారైంది. అది గూడెంకు కొద్ది దూరంలో ఉన్నది, ప్రక్కనే ఎప్పుడూ పారుతుండే సెలయేరు, దాని పక్కనే తన ఇష్టదైవమైన ఈశ్వరుని కోవెల. ప్రభులింగం ఒక మంచి రోజు చూసుకొని గుడిసెలోనికి ప్రవేశం చేశాడు. ఆ రోజు నుంచి సాధన చేయడం మొదలు పెట్టాడు. దీక్షాబోధ చేసిన ప్రభులింగం గురువు "నాయనా నీవు గృహస్థ జీవితం గడుపుతూ శివదీక్ష కొనసాగిస్తే బాగుంటుంది" అన్నాడు.

"ఇంకేం గృహస్థ జీవితం..." అనుకొన్నాడు విరక్తిగా ప్రభులింగం.

"సన్యాసాశ్రమం వయోవృద్ధులయిన తర్వాత స్వీకరిస్తేనే బాగుంటుంది. అందరికీ ఇంద్రియాలను నిగ్రహించుకొనే శక్తి వుండదు. ఏ ఒక్కరికో దైవాంశ సంభూతులకు మాత్రమే అది సాధ్యం" అని హితవు చెప్పాడు.

గురువు చెప్పిన మాటలు చెవిలో మెదులుతున్నప్పుడే అతడికి తన గతం గుర్తుకు వచ్చింది. తను ప్రేమించిన ఎకనామిక్స్ లెక్చరర్ కూతురు గుర్తుకొచ్చింది. పది మొదలు డిగ్రీ వరకు తను ఆమెతో ఎంతగానో సన్నిహితం అయ్యాడు. ఎన్నిసార్లు వాళ్ళు కలిసి సినిమాల కెళ్ళారో ప్రభులింగానికే గుర్తులేదు. అటువంటిది డిగ్రీ కంప్లీట్ కావడం తోటే ఎకనామిక్స్ లెక్చరర్ ఒక గ్రూప్ 1 ఆఫీసరుకిచ్చి వివాహం చేయాలని సంకల్పించింది. నిశ్చితార్థం జరుగబోతున్నదని తెలిసిన వెంటనే ఇంటికి వెళ్ళిన తనను పోలీసు కానిస్టేబుల్ చేత అరెస్టు చేయించింది. అప్పుడు కూడా ఆ అమ్మాయి అడ్డు చెప్పలేదు. గ్రూప్ 1 ఆఫీసరు భర్తవుతుంటే ఏ ఉద్యోగం లేని నన్నెందుకు తలచుకొంటుంది.. "ధనం మూలం ఇదం జగత్" అనుకొన్నాడు. ప్రభులింగం. వివాహం జరిగేంత వరకూ తనను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. తను లెక్చరర్ కూతురు ప్రేమించుకున్నామనీ, తామిద్దరిదీ ఒకటే కులమని చెప్పినా పోలీసులు వినలేదు. చితక బాదారు. జైలు నుంచి విడుదల కాగానే ఇంటికి పోయాడు. వాళ్ళనాన్న ఇంట్లోకి రానివ్వలేదు. కుటుంబం పరువు గంగలో కలిసిందన్నాడు. తను ఇంట్లోకి రావటానికి వీల్లేదన్నాడు. మేడమ్ కేమో డబ్బు, గ్రూప్1 హోదా ఉన్న అల్లుడు కావాలి. నాన్నకేమో పరువు మర్యాదా ముఖ్యం అనుకొన్నాడు విరక్తిగా ప్రభులింగం. ఆమెను ఏ ఊరిచ్చారో కూడా తెలియనివ్వలేదు. ఎదురుగా పోలీసు కానిస్టేబుల్ కొడ్తున్నా ఒక్క మాట కూడా మాట్లాడని ఆ కఠిన 'శిలాహృదయ'ను గురించి ఆలోచించడం వ్యర్థం అనుకొన్నాడు. అనుకున్నదే తడవు నాగరిక మనుషులు, తన్నెరిగిన మనుషులు లేని చోటికెళ్ళి గతమంతా మరచి భగవత్‌చింతనలో గడపాలని నిర్ణయానికి వచ్చాడు అతను. ఆలోచనల్లోంచి తేరుకున్నాడు. ఉదయం ఎనిమిది గంటలు కావస్తోంది. తను ఈ పాటికే శివార్చన చేసి వుండాల్సింది. సెలయేట్లో స్నానం చేసి సూర్యోపాసన చేసి శివార్చనకు అవసరమైన పత్రి కోసం వెళ్ళాడు. దగ్గర్లో ఉన్న ప్రతి అడవి మొక్క ఆకులు, పూలు కోసుకొని వచ్చాడు.

ప్రభులింగం గుడిసె దగ్గరికొచ్చేసరికి తనకు రోజూ భోజనం తెచ్చిచ్చే ఈడు అమ్మాయి అక్కడ కూర్చొని వుంది. ఆమె ఏదో మాట్లాడబోయింది. ముఖం చిట్లించుకున్నా తనకు శివార్చనకు తేనె అవసరం కనుక ఆమె తెచ్చిస్తుందేమో అడగాలనుకొని "అమ్మాయీ" నీవు నాకొక సాయం చేయాలి" అన్నాడు.

"నా పేరు చంద్రకళ" చెప్పిందామె.

"చంద్రకళా నువ్వు నాకు తేనె తెచ్చి పెట్టాలి. డబ్బులిస్తాను ఎంతివ్వమంటావు?"

అడిగాడు.

"మీరేం ఇవ్వొద్దు బాబూ. మీకు కావాల్సినంత తేనె తెచ్చిస్తాను. మా అయ్య రోజూ తెచ్చి అమ్మటానికి పట్నం తీసుకెళ్తుంటాడు. మీరలా ఎవరితో మాట్లాడకుండా ఉండడం మంచి పద్ధతి కాదు. ఎవరితో మాట్లాడకుండా ఎవరితో పలకరింపు లేకుండా బ్రతికే బ్రతుకులో ఆనందం ఏం ఉంది? అందరితో సంతోషంగా ఉండాలి. మన కష్టాలు చెప్పుకోవాలి. ఎదుటి వాళ్ల కష్టాలు తెలుసుకోవాలి. మనం ఏ సాయం చేయలేకపోయినా ఎదుటి వాళ్లకి ధైర్యం చెపుతుండాలి" అన్నది.

చదువుకోని అమ్మాయైనా ఎంత చక్కగా చెప్పిందీమె. సంఘ జీవి మానవుడు అని అరిస్టాటిల్ చెప్పిన మాటలు వాస్తవం అని అప్పుడనిపించింది. మనుషులతో సంబంధం లేకుండా జీవించే వాళ్ళే మానసిక రోగులుగా తయారవుతారన్నమాట వాస్తవం.

"తప్పకుండా మీకు తేనె తెచ్చిస్తాను. బాబూ మీదే ఊరు? ఎందుకిలా ఉన్న ఊరు వదిలి ఈ కొండ ప్రాంతానికి వచ్చారు. నేను మీకు మేలు చేస్తానే కానీ కీడు చేయను. నన్ను నమ్మండి బాబూ" అనడిగింది ప్రాధేయ పూర్వకంగా.

తన కథను ఎవరికీ చెప్పకునేందుకు ఇష్టం లేకపోయినా ఆమె ఆత్మీయంగా, ప్రాధేయ పూర్వకంగా అడిగే సరికి తన కథంతా ఆమెకు చెప్పాడు. "అటువంటామె గురించి నీవు అంతగా దిగులు పడటం మంచిది కాదు. ఆమె నిన్ను నిజంగా మనసు పడి వుంటే నిన్ను పోలీసోళ్ళ చేత కొట్టనిచ్చేదే కాదు. తల్లి తండ్రి బెదిరించి భయపట్టినా నిజమైన ప్రేమ భయపడదు. నీవామెను గురించి మరిచిపో" అని ఓదార్చిందతన్ని.

❂ ❂ ❂

ప్రభులింగం చెప్పిన కథంతా ప్రాణ స్నేహితురాలు దాక్షాయణికి చెప్పింది చంద్రకళ. ప్రభులింగం అమ్మాయిలను చూచి ఎందుకు మొహం చిట్లించుకొంటాడో, ఇష్టపడడో అప్పుడర్థమైంది. "అమ్మాయిలందరూ ఆ పట్నపు అమ్మాయిలా మోసగత్తెలే నన్న అభిప్రాయానికి వచ్చారన్నమాట ప్రభులింగం" అనుకొన్నది దాక్షాయణి.

❂ ❂ ❂

ఓ రోజు ప్రభులింగం అడవిలో నడుస్తున్నాడు. చేతిలో ఈశ్వరుని పూజకు అవసరమయ్యే పత్రి వుంచే సంచి వుంది. ప్రతి చెట్టు ఆకులు కోసి సంచిలో వేసుకుంటూ నడుస్తున్నాడు. ఎదురుగా కొంత దూరంలో ప్యాంట్ షర్ట్ వేసుకున్న యువకుడు ఓ యువతితో ఏదో వాగ్వివాదం పెట్టుకుంటున్నాడు. దగ్గరకొచ్చి ఆమెను పట్టుకోబోతున్నాడు. ఆమె అతని గూబ అదిరేటట్లు ఒకటిచ్చి పరుగెత్తుకుంటూ వస్తోంది. ప్రభులింగాన్ని చూడకుండా పరుగెత్తుకుంటూ రావడం వల్ల ఢీ కొన్నది. ప్రభులింగం పడిపోయాడు. ప్రభులింగం మీద దాక్షాయణి పడిపోయింది. ఆమె స్పర్శ అతనికి విద్యుత్ షాక్‌లా తగిలింది. కాసేపటికి తేరుకొని ప్రభులింగం పైకి లేచాడు. దాక్షాయణిని లేవదీసి

"ఏం జరిగింది? ఎవరతను?" అనడిగాడు.

"నేను సారపప్పు ఏరుతుంటే వచ్చాడు వాడు. మా మేనమామ కొడుకు. నేను వాణ్ణి

ముసలీ ముతకా ప్రభులింగం వద్ద చదువుకొని వడ్డీ లెక్కలు, పేపరు చదువుకోగల స్థాయికి చేరుకున్నారు. ఆ గూడెపు అమ్మాయిలు ప్రభులింగంతో సావాసం చేయాలని చదువు నెపంతో వచ్చే వాళ్ళు కానీ ప్రభులింగం దాక్షాయణితో తప్ప ఇంక ఎవరితోనూ పెద్దగా మాట్లాడే వాడు కాదు. దాక్షాయణి ఓ మల్లెపువ్వులాంటిదన్న అభిప్రాయానికొచ్చేశాడు. ఆమె రావడం కాస్త ఆలస్యం అయినా మిగతా వాళ్ళ చదువు సంగతి పక్కన బెట్టి గూడెం వైపు చూస్తూ ఉండి పోయేవాడు.

మనువాడాలట"

"మనువాడు. మామ కొడుకే కదా?"

"నీ కిష్టం లేని అమ్మిని నువ్వు మనువాడ్తావా?"

"లేదు"

"నాకు వాడంటే ఇష్టం లేదు. వాడితో మాట్లాడ్డం కూడా నా కిష్టం లేదు. పట్నంలో చదివి ఇంకా పాడుబుద్ధి ఎక్కువై వుంటది. నన్ను పాడు చేయాలని చూస్తున్నాడు".

"పట్నంలో చదువుకున్న వాళ్ళందరూ పాడు బుద్ధి కల వాళ్ళేనా" ప్రశ్నించాడు ప్రభులింగం.

"ఎవరో ఒకమ్మి మోసం చేసిందని అమ్మాయిలందరూ మోసగత్తెలనవచ్చా? నాతో ఎప్పుడూ మాట్లాడలేదు నువ్వు"

ప్రభులింగం ఆమె ప్రశ్నకు ఆశ్చర్యపడి తన కథామెకెలా తెలుసో బుఱ్ఱ బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు. తనింత కాలంగా తపస్సు చేస్తున్నాడు. తనకేమీ అతీంద్రియ శక్తులు లేవు. ఈమె కేమైనా శక్తులున్నాయా?" తిక్క తిక్కగా అనుకున్నాడు ప్రభులింగం"

ఇంతలో వగర్చుకుంటూ అక్కడికొచ్చాడు ఆ కుర్రవాడు. దాక్షాయణి ప్రభులింగం చాటుకు చేరింది.

"ఏయ్ ఎవడివిరా నువ్వు? ఆ అమ్మాయిని వదిలేయ్. ఆ అమ్మాయి నా పెళ్లాం. మర్యాదగా వదిలి నీ పనేదో నువ్వు చూసుకో. లేకుంటే ఈ విజయ్ అంటే ఏమిటో నీకు తెలుస్తుంది?

"శరణన్న వారిని కాపాడలేకపోతే నేనేమీ శరణుడను. శరణన్న వారిని ప్రాణం పణంగా పెట్టయినా కాపాడేవాడే నిజమైన శరణుడు. నువ్వు విజయ్‌వైతే, నేను ప్రభులింగాన్ని. శరణు అన్న వారికే ఆపద రానీయడీ ప్రభులింగం".

వెంటనే వాళ్ళిద్దరికీ ఘర్షణ మొదలైంది. విజయ్ ప్రభులింగాన్ని అనేక విధాలుగా ఎదుర్కొంటున్నాడు. విజయ్ తను నేర్చుకున్న కరాటే ప్రదర్శించడం మొదలెట్టాడు. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన ప్రభులింగం కొట్టిన దెబ్బలకు విజయ్‌కు దిమ్మ తిరిగి పోయింది. అమ్మో అయ్యో అనుకుంటూ అక్కణ్ణుంచి పరుగు తీశాడు విజయ్.

ప్రభులింగం వైపు ఆరాధన పూర్వంగా చూస్తూ

"నువ్వు కనుక రాకపోతే నేను తప్పనిసరిగా వాడిని పెళ్ళాడాల్సి వచ్చేది. నువ్వు నన్ను పెళ్ళిచేసుకొంటావా" అనడిగింది అతని కళ్లల్లోకి చూస్తూ. అతను కూడా ఆమె కళ్లల్లోకి చూస్తూ సరేనన్నట్టు తలాడించేశాడు.

❂ ❂ ❂

ప్రభులింగం స్వాముల వారు పేరుకే స్వామీజీగా మిగిలిపోయాడు. పెరిగిన గడ్డాన్ని నీట్‌గా షేవ్ చేసుకుంటున్నాడు. కాషాయ వస్త్రాలు వదిలి ప్యాంట్ షర్ట్‌లు వేసుకోసాగాడు.

ప్రభులింగం త్రికాలాలలో శివార్చన మాత్రం చేస్తున్నాడు. ధ్యానం, జపం దాదాపు మరిచిపోయాడు. గూడెంలోకి పలకలు, పుస్తకాలు తెచ్చిచ్చి వాళ్ళకు చదువు చెప్తున్నాడు. చదువు ఆవశ్యకత గురించి గూడెంలోని వారందరికీ చెప్తున్నాడు. అతడంటే మంచి అభిప్రాయ మేర్పడింది గూడెంలో.

ముసలీ ముతకా ప్రభులింగం వద్ద చదువుకొని వడ్డీ లెక్కలు, పేపరు చదువుకోగల స్థాయికి చేరుకున్నారు. ఆ గూడెపు అమ్మాయిలు ప్రభులింగంతో సావాసం చేయాలని చదువు నెపంతో వచ్చే వాళ్ళు. కానీ ప్రభులింగం దాక్షాయణితో తప్ప ఇంక ఎవరితోనూ పెద్దగా మాట్లాడే వాడు కాదు. దాక్షాయణి ఓ మల్లెపువ్వులాంటిదన్న అభిప్రాయానికొచ్చేసాడు. ఆమె రావడం కాస్త ఆలస్యం అయినా మిగతా వాళ్ళ చదువు సంగతి పక్కన బెట్టి గూడెం వైపు చూస్తూ ఉండి పోయేవాడు.

❂ ❂ ❂

ఒకసారి ఆ గూడేనికి ఆప్రాంతపు ఎమ్మెల్యే రావడం జరిగింది. గూడెం ప్రజల్లో ఉన్న సంపూర్ణ అక్షరాస్యతను తెలుసుకున్న ఎమ్మెల్యే ఆశ్చర్య పడిపోయాడు. సభ్యత, సంస్కారం నెలకొని వుండటం చూసి ఆయన అమితంగా ఆశ్చర్యపడిపోయాడు.

"గూడెంలో ఇంత మంచి మార్పు రావడానికి కారణమెవ్వరు?" అడిగాడు ఎమ్మెల్యే.

"ఇక్కడికి వచ్చిన ప్రభులింగ స్వాముల వారే సారూ" దాక్షాయణి తండ్రి బదులిచ్చాడు.

'నన్ను ఆయన దగ్గరకు తీసుకెళ్ళండి.'

ఎమ్మెల్యే రాగానే ప్రభులింగాన్ని అభినందించాడు. "ఏ స్వార్థం లేకుండా నువ్వు ఈ ప్రాంత ప్రజలకు చేసిన సాయం చాలా గొప్పది. ఈ గూడెం ప్రజలకు ఎటువంటి బంధువు కాకపోయినప్పటికీ నువ్వు చేసిన సాయం చాలా గొప్పది. నీలాంటి యువకులు ఉంటే మన రాష్ట్రం కేరళ కంటే ఎక్కువ అక్షరాస్యతను సాధిస్తుంది. నీ గురించి నేను ముఖ్యమంత్రికి తెలియజేస్తాను" అన్నాడు ఎమ్మెల్యే.

మరుసటి రోజు అన్ని దిన పత్రికల్లోనూ ప్రభులింగం గురించి విశేషాలు ప్రచురింపబడ్డాయి. అన్ని టీవీ ఛానళ్ళూ ప్రభులింగంను చూపించాయి. అప్పుడు టీవీ చూస్తున్న ప్రభులింగం తొలి ప్రేయసి అలానే దిగ్భ్రాంతిగా చూడసాగింది. తనను అమితంగా ప్రేమించిన అతను ఎప్పుడో చనిపోయుంటాడని అనుకుంది. కానీ ఈ రోజు దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. ఎమ్మెల్యే వచ్చి పోయిన పది రోజులకు ముఖ్యమంత్రి దగ్గర్నుంచి పిలుపు వచ్చింది హైదరాబాద్‌కు రమ్మని. ముఖ్యమంత్రి ప్రభులింగాన్ని ఘనంగా సత్కరించాడు.

❋

డా॥ జె.పి. వైద్య

ఆ రోజుల్లో తెలుగు సినీ దునియాలో ఇద్దరు 'వరలక్ష్మి'లు వున్నారు. మన కథానాయకి, గాయని జి. వరలక్ష్మి ఒకరైతే- మరొకరు ఎస్. వరలక్ష్మి గారు. వారిద్దరికి సంబంధించిన ఒక గమ్మత్తు ముచ్చటను తలచుకుందాం. 'మానవతి' సినిమాలో ఎస్. వరలక్ష్మి నాయిక. ఆమె మంచి గాయని కూడా. 'ఓ ....శారదా...' అనే పాట పాడించి రికార్డ్ కూడా చేసి రెడీగా ఉన్నారు. కొన్ని అనుకోని కారణాల వల్ల ఎస్. వరలక్ష్మి నటించలేదు.

అలనాటి సుస్వరాల వరాలు...
జి వరలక్ష్మి

'జీవితం' గురించి తెలిసిన పెద్దలు ఎన్నెన్నో అర్థంకాని 'కొటేషన్లను' మన తలకాయలు బొప్పి కట్టేలా సుత్తితో బాదినట్టు మరీ చెప్పారు. కొందరికి అవి అర్థమయ్యాయి. చాలా మందికి అర్థమై చావలేదు. అందులో మనలాంటి 'గొప్పవాళ్ళూ' ఉన్నారు.

జీవితం గురించి మనం మనకు మాత్రమే అర్థమయ్యేలా నిర్వచనం చెప్పుకున్నాము. దాన్నే 'సూత్రాలుగా' భావించాము. అంతో ఇంతో సినిమాలు, సినీ సంగీతం గోలకు మైమరచి పోయిన వాళ్ళం కాబట్టి మనం సినిమాల ప్రసక్తి లేకుండా జీవించలేము.

సినిమాలు మన ఊపిరి...సినిమా సంగీతం మన రక్త ప్రవాహాన్ని సరి చేసింది. ఏవో అర్థం పర్థం లేని కారణాల వల్ల 'బంద్'లూ 'ధర్నా'లూ ఉన్న అశుభ ఘడియల్లో – 'అన్నా...! గీ బంద్ చేసినోళ్ళ పుణ్యం... సీన్మ చూడకుంట చేసిన్రు....హుం!' అని నిట్టూర్పులు వదిలాం.

ఈ రోజుల్లో నైతే 'అల్ట్రా మోడర్న్ కంప్యూటర్ల హై ఫై జమానా' లో –'అరే! తమ్మీ౦ ఫికర్ చేయకు భై! ఇవాళ వాళ్ళు బంద్ చేస్తున్రు...! రేపు ఇంకోళ్ళు 'ధర్నా' చేస్తరట...! సుకూన్ ఐపాయా! రెండ్రోజులు ఛుట్టీ! పాత సీన్మల సీడీలు పట్కొచ్చిన: రాండ్రి...! దినమంత పాత సేన్మలు చూస్కుంట సుకూన్‌గా ఉందాం రండి...' అని తెగ మురిసిపోయే వాళ్ళూ ఉన్నారు.

అలా ఆశీర్వాదాలుగా లభించే 'సెలవులను' అంత హాయిగానూ గడపడానికి మనలాంటి 'ఫిల్మ్ దీవానాలకు' కావాల్సినంత ఫిల్మీ ముచ్చట్లున్నాయి.

అందించే వాళ్ళున్నప్పుడు దోసిళ్ళ కొద్దీ గ్రోలే వాళ్ళకు కరువా ఏమి?

అలాంటి అరుదైన వ్యక్తిమత్వాలు తెలుగులోనూ, హిందీ సినీ మాయానగరిలోనూ కోకొల్లలు.

చక్కని పాటలతో, అంతే రమ్యమైన నటనతో కొన్ని తరాలను మైమరచి పోయేలా చేసిన వారిలో జి. వరలక్ష్మి ఒకరు. ఈ పూట ఆవిడను ఆత్మీయంగా తలచుకుందాం రండి!

చక్కటి గాన ప్రతిభ ఉన్నా జి. వరలక్ష్మి గాత్రం కన్నా నటనకే కాస్తంత ఎక్కువ వెసులుబాటు ఇచ్చినట్టు కన్పిస్తుంది.

కొన్నింటికి ఇదమిద్ధమైన కారణాలు ఉటంకించి చెప్పలేము కాని, సినీ దునియాలో ఇలాంటి వింతలూ, విడ్డూరాలు అనేకం.

నీలి కళ్ళ అందాల 'ది గ్రేటెస్ట్ షో మ్యాన్ ఆఫ్ ఇండియా'– భారతీయ చార్లీ చాప్లిన్ రాజ్‌కపూర్ అసలు సిసలు 'సంగీత హృదయం' ఉన్న మనిషి. ఆయన పాత సినిమాల్లోని సంగీతం, పాటల సన్నివేశాలూ, చిత్రీకరణలను నిశితంగా 'ఫ్రేమ్- బై - ఫ్రేమ్' చూడండి. ఆయన సామర్థ్యం ఏమిటో అర్థమవుతుంది.

స్వయంగా ఆయన పాడాడు కూడా! పాత తరం వాళ్ళు మీ చుట్టుపక్కల్లో ఉంటే 'జైల్ యాత్ర' రికార్డ్ కోసం ప్రయత్నించండి. అదృష్టం బావుంటే ఆయన పాటలు విని పులకించిపోవచ్చు.

ట్రాజెడీ కింగ్ గా ముద్ర పడిన 'దిలీప్ కుమార్' కూ పాట పాడాలనే 'యమ తపన' ఉండేది. పట్టు పట్టి సాధించే మొండి మనిషి. కాబట్టి లతాతో కలిసి ఒక 'డ్యూయెట్' పాడాడు కూడా! కాని, స్వర సామ్రాజ్ఞి ముందర ఎంత 'కింగ్' లైనా ఏమిటి? లతా ఇంకాస్త తేనె, చక్కెర ఒలికించింది. ఆ పాటలు రొటీన్‌గా చెవుల్లో పడితే మనం అది 'లతా –తలత్' ల యుగళ గీతం అనుకుంటాం.

'లత అంత మధురంగా పాడినా గొంతును పేలవంగా తయారు చేసినట్టుంది' అని తెగ గింజుకున్నాడు 'ట్రాజెడీ కింగ్'. ఆఖర్న మాటలు కూడా బంద్ చేసి పారేశాడు. చొరవ తీసుకున్న సినీ పెద్దోళ్ళు మళ్ళీ 'దోస్తానా' చేయించారు. ఫిలింఫేర్ హ్యాపీ ది ఎండ్ అయిపోయింది. ఆ తర్వాత ప్రపంచం మొత్తంమీద సంగీత విభావరుల్లో ఆ 'భాయీ బహన్'లు ఎక్కడ కలిసినా – 'మేరీ ప్యారీ సి బహన్ లతా కే అనోఖే అవాజ్ కే బారే మేం క్యా కహూం? ... వహ్‌తో ఏక్ చమత్కార్ హై' అని ఇంకాస్త తేనె కలిపి పరిచయం చేసేవాడు దిలీప్ భయ్యా... (నా ప్రియమైన చెల్లి లతా అత్యద్భుతమైన గొంతు గురించి ఏం చెప్పనూ... అది ఓ చమత్కారం.... అంతే!).

పెద్దోళ్ళ ముచ్చట్లు మన బోటి 'నేల టిక్కెట్టు దిల్‌దార్ గాళ్ళకూ' చమత్కారాలే! హిందీలో చాలా 'సెన్సిటివ్ నటి'గా ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన 'నూతన్' (నేటి యువనటి' కాజోల్'కు పిన్ని- కాజోల్ తల్లి తనూజా పెద్దక్క) మంచి గాయని.

మనం 'హిందీ మాయా నగరి' నుంచి మన తెలుగు అందాల జిలుగుల ప్రపంచం వైపు తరలి వద్దాం!

ఆ జమానాలో 'స్వప్న సుందరి' అని ఒక సినిమా వచ్చింది. సంగీతం సి. ఆర్. సుబ్బారామన్ గారిది. సముద్రాల రాఘవాచార్య రచించిన గీతాన్ని జి. వరలక్ష్మి ఎంతో మధురంగా గానం చేసింది. ఆ పాట ఎంతో ప్రజాదరణ పొందింది. మరో గీతం 'మరలిరావో...' కూడా ఎంతో ప్రజాదరణ పొందింది. పాత జ్ఞాపకాలను ఒక సారి నెమరు

వేసుకుందాం. ఓపికతో వెంట రండి.

"నీ సరి నీవేనే జనానా
లేసె రజాణవులే
మొగము తీరు కనుగొన - నగు
మొగము తీరు కనుగొన చురుకైనా మొన
కన రాని సొగసు మనసున
వలరాజు కరానా కులికి ఓ ములికీ
నిలిపెదవు జగానా వలపూ లే వలపూ
అనురాగాలు చిలికెదవే..."

ఇలా సాగుతుంది ఆ గీతం జి. వరలక్ష్మి సుకుమారమైన గొంతు, సన్నగా శృతి బద్ధంగా సాగే గానం. ఆ రోజులు స్వయంగా పాడుకునే గాయక నటీ నటులది. 'పెళ్ళి చేసి చూడు' చిత్రం కోసం పాటలన్నీ ఆమె చేతే పాడించే రకంగా రాశారు. రిహార్సల్సూ సాగాయి.

రాయలసీమ ప్రాంతంలో కరువు నిధి కోసం సినీ దునియా వారు నడుం కట్టారు. ఎన్.టి. రామారావు, జి. వరలక్ష్మి లాంటి వాళ్ళు కరువు నిధి కోసం నాటకాలు వేస్తూ తిరిగారు. అందువల్ల పి. లీలగారు ఆ పాటలు గానం చేశారు. ఒక్క పాట తప్ప, మిగతా పాటలన్నీ హీరోయిన్ జి. వరలక్ష్మి మీదే చిత్రీకరించారు. అయితే ముందు అనుకున్నట్టుగా ఆమె పాడలేదు. అయినా, ఆ సినిమాలో సహజ నటనతో ఎంతోపేరు సంపాదించుకున్నారామె!

ఆ రోజుల్లో తెలుగు సినీ దునియాలో ఇద్దరు 'వరలక్ష్మి'లు వున్నారు. మన కథానాయికి, గాయని జి. వరలక్ష్మి ఒకరైతే- మరొకరు ఎస్. వరలక్ష్మి గారు. వారిద్దరికి సంబంధించిన ఒక గమ్మత్తు ముచ్చటను తలచుకుందాం. 'మానవతి' సినిమాలో ఎస్. వరలక్ష్మి నాయిక. ఆమె మంచి గాయని కూడా. 'ఓ ....శారదా...' అనే పాట పాడించి రికార్డ్ కూడా చేసి రెడీగా ఉన్నారు. కొన్ని అనుకోని కారణాల వల్ల ఎస్. వరలక్ష్మి నటించలేదు. ఆమెకు బదులుగా జి. వరలక్ష్మి నటించారు. ఎస్. వరలక్ష్మి గారి పాటకు తెర మీద పెదవులు కదిల్చినావిడ జి. వరలక్ష్మి గారు. ఎస్ వరలక్ష్మి స్వయంగా పాడి నటించారే తప్ప ఇంకొకరికి ఎప్పుడూ పాడలేదు. అందువల్ల అది ఒక అరుదైన

సంఘటనలా, అపురూప ఘట్టంలా ఆ తరం వారు తలచుకుంటూ ఉంటారు.

హిందీ సినీ మాయానగరిలోనూ గాయకులు మారిపోయిన సంఘటనలున్నాయి.. 'దేవానంద్'కు కిషోర్ గొంతే బెస్ట్ అన్నారు 'అభి న జావో ఛోడకర్'... 'మై జిందగీ కా సాథ్ నిభాతా చలా గయా'... దగ్గర్నించి 'తేరే ఘర్ కే సామ్నే'-'గైడ్'లో రఫీ జాదూ చేయలేదా? అంతెందుకూ? రఫీ లతా కలిసి పాడటం మానుకున్నాక బుజ్జగించి బర్మన్‌దా అద్భుతం సృష్టించిన 'జ్యూయెల్ థీఫ్' ఎవరు మరచి పోయారనీ? ఎర్రని ఊలు ముద్దల తెల్ల చీరలోని వైజయంతిమాల కోసం ఎప్పటి లాగే 'సూటు బూటు'లో దేవానంద్ కోసం రఫీలతా మైమరచి పోయి 'దిల్ పుకారేౘ... అరే అరేౘ' అని పాడితే-మనం కళ్ళప్పగించి చూడలేదా ఏమి?

దిలీప్ సాబ్ కైతే తలత్ -రఫీ- ముకేష్ -మహేంద్రకపూర్ పోటీ పడ్డట్టు గానం చేశారు. మనం కూడా 'ఓహో... ఆహా' అంటూ మైమరచి పోయాం కదా? అవన్నీ నేను మీకు ప్రత్యేకంగా చెప్పే అవసరం ఏముందనీ?

అందువల్ల మనం దారి తప్పిపోయిన 'హిందీ ట్రాక్' నుంచి మళ్ళీ మన 'తెలుగు ట్రాక్' వైపు వచ్చేద్దాం! రండి!

'బారిస్టర్ పార్వతీశం' (1940)-దక్షయజ్ఞం (41)-భక్త ప్రహ్లాద (42)లోని నటన, గానంతో ఆవిడ గట్టి పునాదులతో నిలదొక్కుకుంది. 'పోయిరా ప్రియుడా లండన్' (బారిస్టర్ పార్వతీశం) కోసం, ఆమె పాడి, నటించినప్పుడు ఆమె వయస్సు నిండా 'స్వీట్ సిక్స్‌టీన్' కూడా కాదు. 'ఓన్లీ ఫోర్టీన్' మాత్రమే! ఆ పాట బహుళ జనాదరణ పొందింది. 'ద్రోహి'తో మనోవాంఛలు' పాట, 'పూవు చేరి పలు మారు' యుగళ గీతాలూ వినడానికి సొంపైన గీతాలు.

'దేశమును ప్రేమించుమన్నా' అనే 'జ్యోతి' చిత్రంలోని గీతం తర్వాత ఎందుకో ఆమె పాటలు పాడే గాయని కన్నా 'నటన' కే అంకితమై పోయింది.

'దొరికితే దొంగలు'- 'అంతే కావాలి'లో సియస్సార్ కూతురుగా, పెద్ద పాత్రల్లో 'కులగోత్రాలు' -'ఇద్దరు మిత్రులు'- 'మాంగల్య బలం'-'సుమంగళి'- 'లేత మనసులు' ఇలా ఎన్నో రకాల పాత్రల్లో ఆవిడ ఎంతో మన్నన పొందారు.

ఆ దునియా ఇప్పుడు లేదు. ఆ నటనా ప్రవృత్తులు ఇప్పుడు లేవు. అలాంటివి ఇప్పుడు వెతుక్కున్నా దొరకవు. కాని. 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' కదా!

ఆ బంగారు అనుభవాల అనుభూతులు ఈ రోజుల్లో లభించవు. కాబట్టి మనం- మళ్ళీ అనుభవాల్లో జీవించక తప్పదు. మనం పాత సినిమాల పిచ్చోళ్ళం... ప్రియులం...!

ప్రేమంటే హృదయాన్ని పారేసుకోవడమా!

'సరే!

పాత సినిమాల కోసం, పాత పాటల కోసం మేము, మీరు హృదయంతో పాటు శరీరంగానూ మీద పడి పొంగి పోయే వాళ్ళం కదా?

'హుం! పిచ్చోళ్ళు! పాగల్ గాళ్లూ....' అని అంటే... "ఓకే! ఇ అగ్రీ...!! వుయ్ ఆర్ పాగల్స్...!!!"

✻

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.
ఫోన్ : 08732223622

వీరి వీరి గుమ్మడి పండు
జవాబు

వీరి వీరి
గుమ్మడి
పండు
వీరి పేరు
జయలలిత

విజ్ఞాన వీచిక

ప్రత్యామ్నాయ ఇంధనాలకు పెరుగుతున్న గిరాకీ

ఎస్. వెంకట్రావు





బయో-ఇంధనాలు కాకుండా ఇతర ప్రత్యామ్నాయ ఇంధనాల్లో పెద్ద ఎత్తున పరిశోధనలు జరుగుతోంది సౌర శక్తిపైన. రెండోది పవన విద్యుత్తు. ఇప్పటికే అనేక దేశాల్లో పవన విద్యుత్తును పెద్ద ఎత్తున వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయడం ఆరంభించారు. కాని ఈ రెండు రకాల విద్యుదుత్పత్తిలో అనేక పరిమితులున్నాయి. సౌర విద్యుత్తు రాత్రి పూట ఉత్పత్తి కాదు. అన్ని ప్రాంతాల్లో, అన్ని వేళల్లో సూర్య కాంతి ఒకే మాదిరిగా ప్రసరించబోదు. ఇక పవన విద్యుత్తు పరిస్థితీ అదే. గాలి లేకపోతే మరలు తిరగడం ఆగిపోతుంది. విద్యుదుత్పత్తి నిలిచిపోతుంది. సముద్రపుటలల ద్వారా విద్యుదుత్పత్తి పరిశోధనలు ఇంకా ప్రయోగ దశలోనే ఉన్నాయి.

అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధనం ధరలు పెరిగిపోతుండడం, శిలాజ ఇంధనాలతో భూగోళం వేడెక్కి అనేక అనర్ధాలు సంభవిస్తూ ఉండడంతో ఇప్పుడు ప్రత్యామ్నాయ ఇంధనాలకోసం జరుగుతున్న పరిశోధనలకు గిరాకీ పెరిగింది. ఈ విషయంలో శాస్త్ర ప్రపంచంలో సందడి మరీ ఎక్కువగా ఉంది. ఇప్పటివరకు ప్రపంచంలో చమురు, థర్మల్ (బొగ్గు, గ్యాస్, నాఫ్తాల ద్వారా) విద్యుత్తు, జల విద్యుత్తు, అణు విద్యుత్తులు మాత్రమే వాణిజ్యపరంగా ఉపయోగించుకుంటున్నారు. ఇప్పుడు సూర్యుడి నుండి, గాలి నుండి, సముద్రం నుండి, అంతరిక్షం నుండి, చివరికి భూగర్భం లోపలి నుండి కూడా ప్రత్యామ్నాయ ఇంధనాలు వెలికి తీసే మార్గాలపైకి చర్చ మళ్లింది. ప్రత్యామ్నాయ ఇంధనాలపై గతం నుండీ పరిశోధనలు జరుగుతున్నా అవి వాణిజ్యపరంగా గిట్టుబాటు కాకపోవడంతో వాటి జోలికి పెద్దగా వెళ్ల లేదు.

కాని ఇటీవలి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా అన్ని రకాల ఇంధనాల ధరలూ విపరీతంగా పెరిగిపోతున్నాయి. చమురు ధరలు ఒక్క ఏడాది కాలంలోనే అంతర్జాతీయ మార్కెట్‌లో 80 డాలర్ల వరకు పెరిగింది. అణు ఇంధనం ధరలు కూడా ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగాయి. కొద్ది మాసాల క్రితం అంతర్జాతీయ మార్కెట్‌లో టన్ను 1300 డాలర్లుగా ఉన్న యురేనియం ధర ఇప్పుడు 5000 డాలర్లకు చేరుకుంది. ధరలు పెరగడంతో బాటు ఈ ఇంధనాల వాడకం వల్ల వస్తున్న వాతావరణ కాలుష్య సమస్యలు పెద్ద అలజడి సృష్టిస్తున్నాయి. బొగ్గు, చమురు వాడకం వల్ల గ్రీన్ హౌస్ వాయువుల ఉత్పత్తి పెరిగి భూగోళం వేడెక్కుతోంది గనుక వీటి వాడకాన్ని తగ్గించాలని పెద్ద ఆందోళన చెలరేగుతోంది. అణు ఇంధన వాడకం కూడా ప్రమాద భరితమైనదే గనుక అనేక దేశాల్లో యురేనియం తవ్వకాల దగ్గరనుండి అణు కర్మాగారాలు నెలకొల్పడం, అణు బాంబులు తయారుచేయడం వంటి కార్యకలాపాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ఈ కారణాల వల్ల ప్రత్యామ్నాయ ఇంధనాలవైపు దృష్టి మళ్లింది. ముందుగా బయో ఇంధనాల సృష్టి ఊపందుకుంది. కాని దీనివల్ల కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా పరిస్థితి మారుతోంది. మనుషులు తినే ఆహారం కాస్తా వాహనాలకు ఇంధనంగా మారడంతో ప్రపంచ వ్యాపితంగా 100 కోట్లమందికిపైగా ప్రజలు ఆహార కొరతను ఎదుర్కొంటున్నారు. అన్ని దేశాల్లోనూ ఆహార ధాన్యాల ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్యుల కష్టాలు వర్ణనాతీతమైనాయి.

బయో-ఇంధనాలు కాకుండా ఇతర ప్రత్యామ్నాయ ఇంధనాల్లో పెద్ద ఎత్తున పరిశోధనలు జరుగుతోంది సౌర శక్తిపైన. సూర్యరశ్మిని విద్యుత్తుగా మార్చే ఫోటో వోల్టాయిక్ సెల్స్ తయారీ ఇప్పుడు శరవేగంగా సాగుతోంది. నానో టెక్నాలజీని ఉపయోగించి అత్యంత ఆధునిక పద్ధతుల్లో సోలార్ సెల్స్ తయారు చేస్తున్నారు. వీటిని వాణిజ్యపరంగా నెలకొల్పే ప్రయత్నాలూ సాగుతున్నాయి. రెండోది పవన విద్యుత్తు. ఇప్పటికే అనేక దేశాల్లో పవన విద్యుత్తును పెద్ద ఎత్తున వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయడం ఆరంభించారు. కాని ఈ రెండు రకాల విద్యుదుత్పత్తిలో అనేక పరిమితులున్నాయి. సౌర విద్యుత్తు రాత్రి పూట ఉత్పత్తి కాదు. అన్ని ప్రాంతాల్లో, అన్ని వేళల్లో సూర్య కాంతి ఒకే మాదిరిగా ప్రసరించబోదు. ఇక పవన విద్యుత్తు పరిస్థితీ అదే. గాలి లేకపోతే మరలు తిరగడం ఆగిపోతుంది, విద్యుదుత్పత్తి నిలిచిపోతుంది. సముద్రపుటలల ద్వారా విద్యుదుత్పత్తి పరిశోధనలు ఇంకా ప్రయోగ దశలోనే ఉన్నాయి.

పైన పేర్కొన్న ప్రత్యామ్నాయ ఇంధనాలను వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి చేయగలిగితే మానవాళి ఇప్పుడు ఉపయోగిస్తున్న ఇంధనాలవల్ల ఏర్పడిన సమస్యలు చాలా మట్టుకు మాయమవుతాయి. ప్రత్యామ్నాయ ఇంధనాలు భవిష్యత్తు అవసరాలు తీర్చాలంటే ఇప్పటిమాదిరిగా తక్కువ స్థాయిలో ఉత్పత్తి చేస్తే సరిపోదు. పెద్ద ఎత్తున ఉత్పత్తి (మాస్ ప్రొడక్షన్) జరగాలి. సౌర విద్యుత్తును పెద్ద ఎత్తున వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయాలంటే సోలార్ సెల్ ఉత్పత్తిలో పెద్ద ముందంజ వేయడం మార్గం కాగా భూమ్మీద కాకుండా అంతరిక్షం నుండి సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయడం మరో మార్గం అని అమెరికాలోని 'నాసా' కు చెందిన జాన్సన్ స్పేస్ సెంటర్‌లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం శాస్త్ర పరిశోధనా విభాగం మాజీ మేనేజర్ గ్లెన్ స్మిత్ చెబుతున్నారు. భూమి చుట్టూ అంతరిక్ష కక్ష్యలో పెద్ద పెద్ద 'సూర్యరశ్మి సేకరణ ప్లాంట్లు' నెలకొల్పడం, ఈ ప్లాంట్లు సేకరించే సూర్యరశ్మిని వైర్‌లెస్ రేడియో ట్రాన్స్‌మిషన్ ద్వారా భూమ్మీదకు పంపడం ఇందులో ప్రధానమైన విషయం. భూమ్మీద మనకు ఏ నగరంలో లేక ఏ ప్రాంతంలో విద్యుత్తు కావాలో అక్కడ రిసీవర్లు సౌర ఇంధనాన్ని స్వీకరించి విద్యుత్తుగా మారుస్తాయి.

అంతరిక్షంలో పెద్దపెద్ద సౌర చాపలు నెలకొల్పడమే ఈ ప్రక్రియలో అతి ముఖ్యమైన విషయం. నాసా సహకారంతో అంతరిక్షంలోకి గనుక పరికరాలను రాకెట్ల ద్వారా చౌకగా చేర్చగలిగితే సౌరవిద్యుత్తును యూనిట్ రు. 3.50–4.00 మధ్య ఉత్పత్తి చేయొచ్చని గ్లెన్ చెబుతున్నారు. అంటే దాదాపు ప్రస్తుత థర్మల్ విద్యుత్ స్థాయిలో సౌరవిద్యుదుత్పత్తి చేయగలమని ఆయన అంచనా. ప్రస్తుతం కక్ష్యలో ఉన్న అంతరిక్ష కేంద్రం నుండి ప్రయోగాత్మకంగా

అటువంటి సౌర చాపలు నెలకొల్పడం ద్వారా ప్రయోగం చేసి చూడవచ్చునని ఆయన చెబుతున్నారు. భూమ్మీదకన్నా అంతరిక్షంలో నెలకొల్పిన సౌర చాపాలు (ప్యానల్స్) సూర్యకాంతిని నేరుగా, నిరంతరాయంగా గ్రహించగలవు కనుక అది వాణిజ్యపరంగా లాభదాయకంగా ఉంటుందని ఆయన అంచనా.

బయో-ఇంధనాలు వాణిజ్యపరమైన ఉత్పత్తి దశకు చేరుకోగా సౌర విద్యుత్తుతో పాటు పైన చెప్పిన అనేక రకాలుగా విద్యుదుత్పత్తిపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఇవి కాక శాస్త్రవేత్తల ఆలోచనల్లో ఇంకా అనేక రకాల ప్రత్యామ్నాయాలున్నాయి. వాటిలో భూమి పొరల్లో వేడెక్కిన రాళ్లనుండి విద్యుదుత్పత్తి చేయడం ఒకటి. భూమి క్రింద కొన్ని కిలో మీటర్ల దిగువన రాతి పొరలు 300 డిగ్రీల సెంటీగ్రేడుకన్నా హెచ్చుగా వేడెక్కి ఉంటాయి. భూమి పొరల కదలికల వల్లా, అక్కడి రేడియో ధార్మిక కార్యకలాపాల వల్లా ఇలా జరుగుతుంది. అటువంటి రాతిపొరల్లోకి డ్రిల్లింగు చేసి గొట్టాలు దించుతారు. ఒక గొట్టంద్వారా నీటిని పంపి మరో గొట్టం ద్వారా పైకి తీసుకువస్తారు. కిందికి వెళ్లిన నీరు అక్కడ వేడికి ఆవిరిగా మారి పైకి వస్తుంది. ఆ నీటి ఆవిరితో టర్బయిన్లు తిప్పి విద్యుదుత్పత్తి చేస్తారు. అన్ని చోట్ల కాకపోయినా ప్రతి దేశంలోనూ అనువైన ప్రదేశాల్లో ఇటువంటి డ్రిల్లింగులు చేసి విద్యుదుత్పత్తి చేయవచ్చుననన్నది ఒక ఆలోచన. దీని వల్ల పర్యావరణానికి హాని ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

చంద్రునిపై ఉన్న హీలియం మూలకాన్ని భూమ్మీదకు తీసుకువచ్చి దాని నుండి అణు విచ్ఛిత్తి ప్రక్రియ ద్వారా పెద్ద ఎత్తున విద్యుదుత్పత్తి చేయవచ్చునని చాలా కాలం క్రితం నుండే శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమ్మీద మొత్తంగా కలిపితే 10 కిలోల హీలియం ఉంటుంది. కాని చంద్రునిపై కొన్ని లక్షల టన్నుల హీలియం ఉందని అంచనా. ఒక్క టన్ను హీలియం భూమ్మీదకు తెస్తే దానితో అమెరికా విద్యుత్ అవసరాలు ఒక ఏడాది పాటు తీర్చవచ్చు. భూమ్మీద ఉన్న శిలాజ ఇంధనాలన్నిటినీ కలిపిన దానికన్నా పది రెట్లు ఎక్కువ హీలియం ఇంధనం చంద్రునిపై ఉందని మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పారు. అయితే హీలియం నుండి విద్యుదుత్పత్తి చేసే కర్మాగారాల ఏర్పాటుకు సంబంధించిన పరిశోధనలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. ఇవి వాడుకలోకి వచ్చేసరికి మరో 30 ఏళ్లు పట్టొచ్చు.

ఈలోగా రాకెట్లు, జెట్ విమానాల్లో వాడే హైడ్రోజన్‌ను కార్లలో ఇంధనంగా వాడే పరిశోధనలు ఊపందుకున్నాయి. యూరప్‌లో ఇటువంటి కార్లను వాణిజ్యపరంగా త్వరలోనే ఉత్పత్తి చేయబోతున్నట్లు వార్తలొస్తున్నాయి. హైడ్రోజన్ బాంబు నుండి వచ్చే అణు విద్యుత్తు వేరు. అణు సంయోగ క్రియద్వారా అపారమైన శక్తి విడుదలవుతుంది. దానికి సంబంధించిన అణు రియాక్టర్ల తయారీపై ఇంకా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. కాని కార్లలో వాడే హైడ్రోజన్ గాలిలోని ఆక్సిజన్‌తో కలిసి నీటి ఆవిరిగా మారే



క్రమంలో వెలువడే రసాయనిక శక్తి ఇక్కడ ఇంధనంగా ఉపయోగపడుతుంది. ఇందులో నీటి ఆవిరి విడుదలవుతుంది గనుక వాతావరణ కాలుష్యం సమస్యే ఉత్పన్నం కాదు. హైడ్రోజన్ వాహనాలు రోడ్లమీద విరివిగా తిరిగే రోజు త్వరలోనే రావచ్చునని నిపుణులు చెబుతున్నారు. 'అవసరమే అన్వేషణకు హేతువు' అన్నట్లు మానవుడి ఇంధనావసరాలు పెరుగుతున్న కొద్దీ అనేక రకాల ప్రత్యామ్నాయ ఇంధనాలపై పరిశోధనలూ పెరుగుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న మానవుని ఇంధన తృష్ణ తీర్చడానికి ఎన్ని ఇంధనాలైనా ఎక్కడ సరిపోతాయి?!

❋

మరి వాళ్లేం చేస్తారు?

చింటూ: భూమ్మీద మనం ఉంది ఇతరులకు సాయం చేసేందుకే అని మా టీచర్ చెప్పారు నాన్నా

చిన్నారావు: నిజమే బాబూ

చింటూ: అయితే మరి ఇతరులేం చేస్తారు నాన్నా?



కథా నిలయం



ఎక్కువ సేపు చదవలేను

నేను ప్రస్తుతం డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాను. పదవ తరగతి వరకు బాగానే చదివేవాడిని. కానీ ఇంటర్ మీడియట్ నుండి సరిగ్గా చదవడం లేదు. నాకు చదవాలని వుంటుంది. ఎన్నో చేయాలని వుంటుంది. కానీ పుస్తకం తీయాలనిపించదు. తీసినా ఎక్కువ సేపు చదవలేను. అన్నీ వచ్చినట్టే అనిపిస్తాయి. క్లాసులకు వెళ్ళను. లెక్కలంటే భయం. కానీ జీవితంలో ఏదైనా సాధించాలని వుంది. నా స్నేహితులు అందరూ ఒక్క ప్రశ్నని అర్థగంటలో చదివితే నేను మూడు గంటలు చదువుతాను.

పరమేష్, పాలకొల్లు.

జీవితంలో ఏదైనా సాధించాలంటే చదవాలి. మీరు మూడు గంటలు అదే పనిగా చదవటం వల్ల చదివినా దానిలో మొదటిది, ఆఖరిది గుర్తుంటుంది. మధ్యలో మరచి పోతుంటారు. కాబట్టి 45 నిమిషాలు చదివి 10 నిమిషాలు విరామం ఇవ్వండి. 10 నిమిషాలు మీరు చదివిన విషయాలలో ముఖ్యమైన విషయాలను గుర్తుకు తెచ్చుకోండి. మీరు ఉపాధ్యాయులు చెప్పే సారాంశంలో కీలకమైన పదాలను రాసుకోండి. వాటి సారాంశాలను మరల స్వయంగా తయారు చేసుకోండి. మీరు నేర్చుకున్న పాఠాలలో కీలకమైన పదాలను నోట్స్‌గా రాసుకోండి. తయారు చేసుకున్న నోట్స్ స్పీడ్‌గా చదవడానికి, రివిజన్ చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. దీనిని గుర్తుంచుకోవడం సులభం. దానిని పరీక్షల్లో తిరిగి విస్తరింప చేసి రాయటం సులభమవుతుంది. రోజూ క్రమం తప్పకుండా రాయడం అలవాటు చేసుకోవడం ద్వారా రైటింగ్ స్పీడ్‌ను పెంచుకోవచ్చు. ఉదయం 5-9 గంటల వరకు మెదడు బాగా చురుగ్గా పని చేస్తుంది. అందుచేత మీరు ఉదయం పూట లేచి చదువుకోవడం వల్ల ఎక్కువగా విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోగలుగుతారు. మీరు తెలివిగా టైమ్‌ని మేనేజ్ చేసుకుంటూ, మైండ్‌ని ఫ్రెష్ చేసుకుంటూ చదవండి. కాలేజీ నుంచి వచ్చిన తరువాత అరగంట పడుకుని లేచి ఆ తరువాత హోమ్ వర్కు చేసుకోవడం, చదవడం చేయండి. మీలో నిద్రాణమై వున్న మీ క్రియేటివిటీని తట్టి లేపండి. మీరు క్రియటివ్‌గా ఆలోచించే కొద్దీ మీ న్యూరాలాజికల్ శక్తి మరింత చురుకుగా వుంటుంది. ఫలితంగా మీలో అభ్యసనా సామర్థ్యం దానంతట అదే పెరుగుతుంది.

ఫస్ట్ రావాలని కోరిక

నేను ఇంటర్ చదువుతున్నాను. మా అమ్మ నీకు ఈ జన్మకు చదువురాదు. ఏ రంగంలోనూ ప్రతిభ చూపవు. పీపాలాగా ఒళ్ళు పెంచుకొని నడవడమే కష్టం నీకు. ఇంకే ఆడతావు. దేనికి పనికిరాని మొద్దువే, వంటారాదు, కూర్చుని తినటం తప్ప నీకింకేం తెలియదు అంటుంది. నేను అన్నిట్లోను ఫస్ట్ రావాలని అమ్మ

కోరిక. నాకూ అది ఇష్టమే కాని ఎంత ప్రయత్నించినా ఫస్ట్ రావటం లేదు. నాకు జీవితం మీద విరక్తి కలుగుతోంది. నా బతుకింతేనా?

అశ్విని, పాలకొల్లు.

చిన్నతనం నుంచి మీ అమ్మగారి మాటలు మైండ్‌లో రికార్డు అయి మిమ్మల్ని వెనక్కి లాగేస్తున్నాయి. ఆ రికార్డు అయిన టేపులు ప్రాబల్యం మీమీద బలంగా వుంటుంది. అవే మీ గమ్యాన్ని నిర్దేశిస్తాయి. వర్తమానంలో మీ ప్రవర్తనను శాసించటమే కాదు, రేపటి మీ జీవితాన్ని కూడా కర్కశంగా డైజన్ చేస్తాయి. మీ మైండ్ అనే టేపులో మళ్లీ కొత్త విషయా లను రికార్డు చేసుకోవాలి. లేదా వాటిని వినటం మానెయ్యాలి. నమ్మకం, ఆచారం, మీపై మీకు గల అభిప్రాయం భవిష్యత్తు పట్ల మీకు వుండే దృక్పథం మిమ్మల్ని విజేతగా నిలుపుతాయి. మీకు మీరే పోటీ. జీవితంలో ప్రతి అడుగు ముందుకు వేయాలనే జిజ్ఞాస, తపన మీలో వుంది. మీ మైండ్ పవర్‌ని మేలు కొలపండి. మీరు మీ కనులు సారించి మిమ్మల్ని మీరు చూసుకోండి. మీరు చేస్తున్న పనేమిటో

పాం ద ం తం న్న

శిక్షణనేమిటో గమనించండి. మైండ్ ఒక డైనమో లాంటిది. అది అత్యంత శక్తి వంతమైన సాధనం. ఆ శక్తిని మీకు అనుకూలంగా ఉపయోగించుకోండి. సవాళ్లను ఎదుర్కొంటూ విజయాన్ని సాధించిన సంఘటనలను సదా మననం చేసుకోండి. ఆయా భావాలే మీలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయి. మిమ్మల్ని విజేతగా నిలుపుతాయి.

విరక్తి కలుగుతోంది

నేను పదవ తరగతి పాస్ అయ్యి ఐదు సంవత్సరాలు అయ్యింది. ఆర్థిక ఇబ్బందుల వల్ల చదవ లేదు. తమ్ముడిని చదివిస్తున్నాను. మా నాన్న ఏ పనీ చేయరు. తిని తిరుగుతుంటారు. ఒకవైపు నేను చదువుకోలేదని బాధ. మా నాన్న ఏమీ చేయరని కోపం. జీవితం మీదం విరక్తి కలుగుతోంది. సలహా ఇవ్వగలరు.

అనురాధ, నిజామాబాద్.

మీరు మీ తమ్ముడిని చదివించడం సంతోషించదగిన విషయం. మీ గురించి కాస్త ఆలోచించండి. మీ నాన్నను గురించి అనవసరంగా ఆలోచిస్తుంటే మీరు సమస్యలకు లోనవుతారు. కాబట్టి మీరు ట్యూషన్స్ చెప్పి కుట్లు, అల్లికలు, చక్కటి డిజైన్లు నేర్చుకోండి. ఇంటర్ ప్రైవేటుగా చదవండి ఖాళీగా వుండకుండా మీరేం కావాలను కుంటున్నారో దాన్ని సాధించడానికి ప్రయత్నం చండి. మీ జీవితం మీద దాన్ని ఆనందంగా తీర్చిదిద్దుకునే ఛాయిస్ మీదే. ఎప్పుడూ ఉత్సాహంగా నవ్వుతూ వుండండి... దాని వల్ల శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉంటారు. అప్పుడు మీరు అనుకున్న విధంగా మీరు మారగలరు. మీ నాన్నగారిని కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ దగ్గరకు తీసుకెళ్ళండి.



నవ్వుల పోటీ

నవ్వుల్లో బోలెడన్ని రకాలుంటాయి. చిరునవ్వు, మందహాసం, దరహాసం, వికటాట్టహాసం... ఇలా అన్నమాట. కొందరు నవ్వితే అప్పుడే విచ్చుకుంటున్న మల్లెపువ్వును చూసినట్టుంటుంది. మరికొందరు నవ్వితే ప్రశాంతంగా వున్న కొలనులోకి రాళ్ల వర్షం కురిపించినట్టు వుంటుంది. నవ్వితే ఆరోగ్యంగా వుంటామని కొందరు లాఫింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేసుకుని మరీ రకరకాలుగా నవ్వడం చూస్తుంటాం. కొన్ని చోట్ల ఏకంగా నవ్వులపోటీలు కూడా జరిపి విజేతలను సత్కరిస్తుంటారు. ఏంటి! అలా చూస్తున్నారు. నవ్వు మీద క్లాస్ కాస్త ఎక్కువైనట్టుందికదూ. సరే డైరెక్ట్‌గా పాయింట్‌కొచ్చేద్దాం. థాయ్‌ల్యాండ్‌లో ఈ మధ్య నవ్వుల పోటీ జరిగింది. అందులో జిట్టారాత్ అనే మహిళ గెలుపొందింది. ఈవిడ ఆపకుండా 12 నిముషాల 26 సెకన్లపాటు నవ్వి విజయం సాధించింది.

హైటెక్కు పంది

రాత్రింబగళ్లు బురదలో పొర్లుతూ గడపడమంటే పందులకు బోలెడంత ఇష్టం. అసలు కడుపునిండా తిని వంటినిండా బురద పులుముకుని బద్ధకంగా దొర్లాడటమే వాటి దిన చర్య. కాని ఇది హైటెక్కు పందిపిల్ల. అందుకే నాలుగుకాళ్లకూ బూట్లు తొడుక్కుని మరీ బురదలో పచార్లు చేస్తోంది.

కథా నిలయం
శ్రీకాకుళం

నిజమైన శిల్పి

సాహిల్. కె

విజయవర్మ అవంతీపుర రాజు. ఆయనకు కూసింత కళాపోషణ ఎక్కువే. మంచి ప్రకృతి ఆరాధకుడు. ఓరోజు విశ్రాంతి మందిరంలో పచార్లు చేస్తుండగా...వర్షం పడింది. వరండాలోకి వచ్చి తెరలు తెరలుగా పడుతున్న వర్షాన్ని, చెట్ల మీద వానలో తడుస్తున్న పక్షులను, పువ్వులను, ఆకుల నుంచి ధారలా కారుతున్న నీటిని చూస్తూ... వాన కురుస్తున్నప్పుడు వస్తున్న శబ్దాన్ని ఆస్వాదిస్తూ ... పరవశించిపోయాడు.

ఆ అద్భుతాన్ని ప్రజలందరితో కలిసి పంచుకోవాలనుకున్నాడు. వెంటనే మంత్రులందరినీ హాజరుపరిచాడు. వారినుద్దేశించి మాట్లాడుతూ...

"మనకు కడుపునిండా తిండి పెట్టేదీ...తాగడానికి నీటిని అందించేదీ వాన దేవతే. మన పంటలు పచ్చగా వుండడానికీ...మన జీవితాలు కళకళలాడుతుండడానికీ...కారణం వర్షమే. అందుకే ఆ వర్ష దేవతను పూజిద్దాం. ఆ పని చేయాలంటే.. మంచి విగ్రహం కావాలి...అలా చక్కటి విగ్రహాన్ని సృజించిన శిల్పిని కూడా గౌరవిద్దాం...ఏమంటారు?!" అన్నాడు.

"ఔనౌను. మన దేశంలో శిల్పులకేమీ కొదవలేదు. చక్కగా చెక్కుతారు. వారందరినీ పిలిపించి వాన దేవత శిల్పాన్ని చెక్కమందాం. అలా ఎవరైతే మంచి శిల్పాన్ని చెక్కుతారో వారిని సత్కరిద్దాం..." అన్నారు ముక్తకంఠంతో.

కానీ ఇదంతా సభలో వున్న ఓ మంత్రికి నచ్చలేదు. వెంటనే లేచి "మహారాజా! మనకు శిల్పులకు కొదవ లేదు. నిజమే. వారంతా వచ్చి పోటీలో పాల్గొంటారు. వారిలో ఎవరో ఒకరు చెక్కిన శిల్పం మీకు నచ్చుతుంది. మీరు సత్కరిస్తారు. కానీ నిజమైన శిల్పి ఇతరులను ఆనందింపచేయడం కోసం శిల్పాలు చెక్కడు. తన మనసుకు నచ్చేలా శిల్పాలు రూపొందిస్తాడు. అందులోనే తృప్తి పొందుతాడు. తను ఒక శిల్పాన్ని మొదలెట్టాడూ అంటే అది అయ్యేవరకు నిద్రాహారాల జోలికి పోడు. అలాంటి వాడు నిజమైన శిల్పి. అలాంటి వారిని సత్కరిస్తే మంచిది ప్రభూ..." అన్నాడు.

ఆమాటలతో రాజు ఆలోచనలో పడ్డాడు. కాసేపటి తర్వాత...

"మరి మీ ఎరుకలో అలాంటివారెవరైనా వున్నారా? వుంటే సెలవివ్వండి. అతనిని...అతని శిల్పకళా చాతుర్యాన్ని పరిశీలించిన మీదటే అతను గౌరవం పొందడానికి అర్హుడా...కాడా అనేది నిర్ణయించుకుందాం... అతని దగ్గరకు మనమే వెళదాం పదండి" అంటూ పరివారాన్ని సిద్ధం కమ్మన్నాడు.

❖ ❖ ❖

రాజు, మంత్రులు, సైన్యం, ఔత్సాహికులు...అంతా ప్రయాణమై బయలుదేరారు. అడవులు, కొండలు, గుట్టలు, నదులు, లోయలు దాటుకుంటూ ... ముందుకు నడిచీ...నడిచీ ఎట్టకేలకు ఒక చక్కటి ప్రదేశానికి చేరుకున్నారు. ఆ ప్రాంతాన్ని చూచిన ప్రతి ఒక్కరూ శిలా ప్రతిమల్లా అలా వుండిపోయారు. అంత ఆహ్లాదకరంగా వుందాచోటు. జీవం వుట్టిపడుతున్న శిల్పాలు, వాటికి అల్లుకున్న మొక్కలు, వాటికి పూచిన పూలు, తొడిగిన మొగ్గలు...వాటినుంచి వెదజల్లుతున్న సుగంధ సువాసనలు...అంతా వైమరిచిపోయి చూస్తుండిపోయారు.

చాలాసేపటి తర్వాత తేరుకొని ఎట్టకేలకు భారంగా లోపలి అడుగులు వేశారు. అక్కడ కనిపించిన దృశ్యం చూసి మరోసారి ఆశ్చర్యచకితులయ్యారు. లోపల ఎటు చూసినా శిల్పాలే. వివిధ భంగిమలలో చూపరుల హృదయాలను ఇట్టే ఆకట్టుకున్నాయి. అక్కడ ఓ వ్యక్తి తనదైన లోకంలో వున్నాడు. ఓ విగ్రహాన్ని దృష్టి మరల్చకుండా చెక్కుతూ కనిపించాడు. ఇంత మంది గోలగోలగా లోపలికి వచ్చినా అతని ఏకాగ్రత ఏమాత్రం చెదరలేదు. అలా చెక్కుతూనే వున్నాడు. అతని చేతిలో తయారవుతున్న విగ్రహం అప్పుడే చెక్కడం పూర్తయినట్టుంది. తనివితీరా చూసుకుంటున్నాడు.

విజయవర్మకు ఆ శిల్పం ఎంతగానో నచ్చింది. అందుకే

"శిల్పీ...! నీ చేతిలో ఎంతో విద్య వుంది. ఇంతకీ నువ్వు చెక్కిన విగ్రహం ఎవరిది?..." అనడిగాడు.

మహారాజును చూచి నమస్కరించి "రాజా! వానదేవత శిల్పం ఇది. ఆమె పాదాల చెంత శిరులొలికే పంటలు గాలికి అటూ ఇటూ కదులుతున్నాయి. ఆమె శిరస్సుపైన కనిపిస్తోంది వాన మబ్బులు.... ఏదో నా తృప్తి కోసం దీన్ని చెక్కాను...." అని సమాధానమిచ్చాడు.

"భళా శిల్పీ భళా! మరి నీ చేతిలో ఇంత కళ వుందికదా. వీటిని అమ్మితే బోలెడంత డబ్బు వస్తుందికదా. ఇలా అడవుల్లో కొండల్లో నివసించే ఖర్మ నీకేంటి?" అనడిగాడు.

"రాజా! నాకు తెలిసిన విద్య శిల్పాలను చెక్కడమే. అదీ నా తృప్తి కోసం చెక్కుతుంటాను. ఇక వాటిని అమ్మే పనంటారా! వ్యాపారులది. వారు నాకు ఎంతో కొంత ఇచ్చి శిల్పాలను తీసుకెళుతుంటారు..." సమాధానమిచ్చాడు.

వెంటనే రాజు ఒక నిర్ణయానికొచ్చాడు. డబ్బుకోసం కాకుండా తన తృప్తికోసం శిల్పాలను అద్భుతంగా చెక్కుతున్న ఆ శిల్పిని గౌరవించాలనుకున్నాడు. వెంటనే అతణ్ణి రాజధానికి తీసుకెళ్లి... అతిథి మర్యాదలు చేసి ఘనంగా సత్కరించి పంపాడు.